


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు





సంపుటి : 1 సంచిక : 334 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : ఒంగోలు | మంగళవారం 4 ఆగస్టు 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :334 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : ONGOLE | TUE 4 AUGUST 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




“మిస్టర్ డ్రామారావు”

## అంటూ కేటీఆర్ పై మంత్రి పొంగులేటి ఫైర్

- పెద్ది సుదర్శన్ రెడ్డి మరణంతో బీఆర్ఎస్ రాజకీయం చేస్తోందని ఆరోపణ
- పదేళ్లలో మంత్రి పదవి ఇవ్వకుండా అవమానించారని విమర్శ
- అధికార లాంఛనాలతో గౌరవించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని వెల్లడి
- వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు గుణపాఠం చెబుతారని వ్యాఖ్య

**పెన్ పవర్ డెస్క్:** తెలంగాణ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పొంగులేటి శ్రీనివాసరెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెం ట్ కేటీఆర్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దివంగత ఉద్యమ నేత

- మిగతా 2లో

## నిమ్స్‌లో 1000 రోబోటిక్ సర్జరీలు.. దేశంలోనే కొత్త రికార్డ్!

- మూడేళ్ల లోపే ఈ మైలురాయిని అందుకున్న ఆసుపత్రి
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో దేశంలోనే ఇదొక కొత్త బెంచ్‌మార్క్
- 90 శాతం సర్జరీలు ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్ కింద ఉచితంగా నిర్వహణ
- నిమ్స్ బృందాన్ని అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి, ఆరోగ్య మంత్రి దామోదర



**పెన్ పవర్ డెస్క్:** హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) వైద్య రంగంలో అరుదైన మైలురాయిని అధిగమించింది. మూడేళ్ల కంటే తక్కువ వ్యవధిలోనే 1000 రోబోటిక్ శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలంగాణ ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. దేశంలోని ప్రభుత్వ ఆరోగ్య సంస్థల్లో ఇదొక నూతన రికార్డు అని, సామాన్యులకు సైతం అత్యాధునిక రోబోటిక్ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చామని ప్రభుత్వం పేర్కొంది. ఈ అద్భుత ఘనత సాధించిన నిమ్స్ డైరెక్టర్, యూరాలజీ అండ్ రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్‌తో పాటు యూరాలజీ,

- మిగతా 2లో

## మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపుల కేసులో తీర్పు.. నిర్దోషిగా బ్రిజ్ భూషణ్



- మహిళా రెజ్లర్ల లైంగిక వేధింపుల కేసులో బ్రిజ్ భూషణ్‌కు ఊరట
- ఆయన్ను నిర్దోషిగా ప్రకటించిన ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు
- సహ నిందితుడు వినోద్ తోమర్‌కు కూడా క్లీన్ చిట్
- గౌరవప్రదంగా నిర్దోషిగా తేల్చిందన్న బ్రిజ్ భూషణ్

- మిగతా 2లో

## కర్ణాటక కేబినెట్ విస్తరణ: చివరి నిమిషంలో మార్పులతో కాంగ్రెస్‌లో అసమ్మతి జ్వాలలు

- కర్ణాటక కేబినెట్ విస్తరణతో కాంగ్రెస్‌లో తీవ్ర అసమ్మతి
- చివరి నిమిషంలో జాబితా నుంచి మంకాల్ వైద్య పేరు తొలగింపు
- సీనియర్ లింగాయత్ నేత ఎస్.ఎస్. మల్లికార్జున్‌కు చోటు
- పదవులు దక్కని ఎమ్మెల్యేలు రాజీనామా చేస్తామని హెచ్చరిక
- ఎమ్మెల్యే తన్వీర్ సేఠ్ మద్దతుదారుడి ఆత్మహత్యాయత్నం

- మిగతా 2లో



## బీజేపీకి భారీ షాక్.. బంకీపూర్ కోట బద్దలు కొట్టిన ప్రశాంత్ కిశోర్

- 19,324 ఓట్ల ఆధిక్యంతో బీజేపీ అభ్యర్థిపై గెలుపు
- మూడు దశాబ్దాలుగా బీజేపీకి కంచుకోటగా ఉన్న స్థానం కైవసం
- ఎన్నికల బరిలో తొలి విజయాన్ని అందుకున్న జన సురాజ్ పార్టీ

**పెన్ పవర్ డెస్క్:** ప్రముఖ రాజకీయ వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్ (పీకే) ప్రత్యక్ష రాజకీయాల్లో సంచలన విజయాన్ని నమోదు చేశారు. బీహార్‌లోని బంకీపూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన

- మిగతా 2లో





## టీటీడీ ఆసుపత్రుల్లో మందుల కొనుగోళ్లలో భారీ అవినీతి

లోకేశ్‌పై భూమన కరుణాకర్ రెడ్డి తీవ్ర ఆరోపణలు

- ఏపీలో అవినీతి తీవ్ర స్థాయికి చేరిందన్న భూమన
- టీటీడీని కూడా వదలకుండా పీడిస్తున్నారని ఆరోపణ
- ఎల్1 టెండర్ల పేరుతో అక్రమాలకు తెరలేపారన్న భూమన

**పెన్ పవర్ డెస్క్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అవినీతి తీవ్ర స్థాయికి చేరుకుందని వైసీపీ నేత, టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి మండిపడ్డారు. ఈ అవినీతిలో మంత్రి నారా లోకేశ్ పాత్ర స్పష్టంగా ఉందని ఆరోపించారు. తిరుపతిలోని ప్రసిద్ధ స్విమ్స్, బర్డ్స్ ఆసుపత్రుల్లో ప్రాణరక్షక మందులు, వైద్య పరికరాల కొనుగోళ్లలో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని విమర్శించారు. పవిత్రమైన ధార్మిక సంస్థ అయిన టీటీడీని కూడా వదిలిపెట్టకుండా ఇష్టమొచ్చినట్లు పట్టి పీడిస్తున్నారని ధ్వజమెత్తారు. శస్త్ర చికిత్సలకు అవసరమైన పరికరాల నుంచి పెద్ద పెద్ద యంత్రాల టెండర్ల వరకు తీవ్రస్థాయిలో గోల్‌మాల్ జరుగుతోందని విమర్శించారు. ఎల్1 టెండర్ల పేరుతో అక్రమాలకు తెరలేపారని, కంపెనీలతో ముందే లోపాయికారీ ఒప్పందాలు కుదుర్చుకుని, తక్కువ ధరకు లభించే పరికరాలను టీటీడీకి ఎక్కువ ధరకు అమ్ముతూ సొమ్ము

- మిగతా 2లో

## రవాణా శాఖలో అనవసర నిబంధనలు

# తొలగించండి

- తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు
- ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులపై సమీక్ష
- రవాణా శాఖలో అనవసర నిబంధనలు తొలగించి, సేవలు సులభతరం చేయాలని సూచన
- పశుగ్రాసం కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశం
- వివిధ శాఖల పనితీరుపై ఆర్టీజీఎస్‌లో ముఖ్యమంత్రి కీలక ఆదేశాలు జారీ

**పెన్ పవర్ డెస్క్:** రవాణా శాఖలో అనవసర నిబంధనలను తక్షణమే తొలగించాలని, టెక్నాలజీని పూర్తిస్థాయిలో ఉపయోగించి ప్రజలకు సులభతరమైన, అవినీతి రహిత సేవలు అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ సెంటర్‌లో సోమవారం వివిధ శాఖల పనితీరుపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రవాణా శాఖలో చేపట్టాల్సిన సంస్కరణలపై సీఎం కీలక సూచనలు చేశారు. రవాణా శాఖలో సంస్కరణలకు తీసుకుంటున్న చర్యలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. 24 గంటల్లో డీమ్డ్ రిజిస్ట్రేషన్ విధానం, ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్స్ ఏర్పాటు, ఫారం-5బీ వంటి పరీక్షల తొలగింపు ద్వారా అవినీతికి ఆస్కారం లేకుండా చూడవచ్చని తెలిపారు. ఈ చర్యలతో ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. దశలవారీగా ఈ సంస్కరణలను



అమలు చేసేందుకు తాము ప్రణాళిక సిద్ధం చేశామని అధికారులు చెప్పగా, వీలైనంత త్వరగా అనవసర నిబంధనలను తొలగించి, ప్రజలకు ఇబ్బందులు లేని వ్యవస్థను రూపొందించాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సమీక్షలో రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులపై కూడా సీఎం సుదీర్ఘంగా చర్చించారు. ఎల్ నినో ప్రభావంతో తాగునీటి ఎద్దడి తలెత్తే ప్రమాదం ఉందని, ఈ సమస్యపై అధికారులు ప్రత్యేక

- మిగతా 2లో



## డీల్ కుదుర్చుకోండి.. లేదా లొంగిపోండి

**పెన్ పవర్ డెస్క్:** ఇరాన్ తమతో ఒప్పందం కుదుర్చు కోవాలని లేదా పూర్తిగా లొంగిపోవాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్ ద్వంద్వ వైఖరిని అవలింబిస్తోందన్నారు. “ ఆ దేశ నాయకులు మాతో చర్చలు కావాలని కోరుతున్నారు. కానీ బహిరంగంగా నిరాకరిస్తున్నట్లు చెబుతున్నారు. మరోవైపు హర్మూజ్‌ను తామే నిర్వహిస్తున్నామని చెబుతున్నారు. ఆ జలసంధి పూర్తిగా అమెరికా నియంత్రణలో ఉంది. మేము కోరుకుంటే

- మిగతా 2లో



## ‘గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఏపీ’ పనుల్లో వేగం పెంచండి

**పెన్ పవర్ డెస్క్:** తీర ప్రాంత పర్యావరణ పరిరక్షణ, కోతల నివారణ చర్యల్లో భాగంగా చేపట్టిన ప్రాజెక్టు గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పనుల్లో వేగం మరింత పెరగాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశించారు. ఈ ఏడాది నిర్దేశిత లక్ష్యాలను వచ్చే రెండు నెలల్లో పూర్తిచేసేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని స్పష్టం చేశారు. గ్రేట్ గ్రీన్ వాల్ పనుల పురోగతిపై అటవీశాఖ ఉన్నతాధికారులతో పవన్ సమీక్షించారు. డివిజన్లవారీగా నిర్దేశించిన లక్ష్యాలు ఎంత వరకు పూర్తి చేశారు? ఇప్పటి వరకు ఎన్ని మొక్కలు నాటారు?

- మిగతా 2లో

## కడప ఎయిర్‌పోర్ట్ లంచం కేసు: మాజీ అధికారికి మూడేళ్ల కఠిన కారాగారం

- కడప ఎయిర్‌పోర్ట్ లంచం కేసులో సీబీఐ విచారణ
- 9 ఏళ్ల క్రితం కాంట్రాక్టర్ నుంచి రూ. 50,000 లంచం డిమాండ్ చేసిన వైనం
- రూ. 25,000 తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న సీబీఐ అధికారులు
- మాజీ ఏజీఎం శ్రీనివాసన్‌కు జైలు శిక్షతో పాటు రూ. 50,000 జరిమానా విధించిన కోర్టు

- మిగతా 2లో




## రాయలసీమ వనరులు తీవ్రంగా దోపిడీకి గురయ్యాయి

- రైజింగ్ రాయలసీమ కార్యక్రమంలో పాల్గొన్న మాధవ్
- ఈ ప్రాంతం నుంచి ఎంతో మంది సీఎంలు వచ్చారని వ్యాఖ్య
- రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రచించాలని పిలుపు

**పెన్ పవర్ డెస్క్:** కర్నూలు రాయలసీమ విశ్వవిద్యాలయంలో సమర్థ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ‘రైజింగ్ రాయలసీమ’ కార్యక్రమంలో

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# సొంత వ్యూహాలతో జనసేన సిద్ధమేనా ?

రాజకీయాలు అంటే నిరంతరం పారే నది లాంటివి. ఆ నదిలో కూడా పైకి కనిపించే స్వచ్ఛత లోపల ఉండదు, పైగా గండాలు సుడి గుండాలు ఎన్నో ఉంటాయి. అలాంటి పాలిటిక్స్ అంటేనే టఫెస్ట్ జాబ్ అని అంటారు. ఇక్కడ ఎవరూ ఒకరిని కోరి ముద్దాడరు, అలాగే నెత్తికి ఎక్కించుకుని అందలాలు అందించరు, శోధించి సాధించిన వారికే పగ్గాలూ పట్టాభిషేకాలు దక్కుతాయి. జనసేన ఈ విషయంలో గట్టిగానే ఆత్మ పరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందని అంటున్నారు. జనసేన అధినేత ఎప్పుడూ ఏ వేదిక మీద అయినా ఒక్కటే మాట అంటున్నారు, పొత్తులు కూటములు అంటూ ఆయన మాట్లాడుతున్నారు. పొత్తులు అన్నవి రాజకీయాల్లో వ్యూహం మాత్రమే. వ్యూహాలు కూడా పది వేస్తే అన్నీ హిట్ అవాల్సిన అవసరం లేదు, పైగా ఒకసారి హిట్ అయింది మళ్ళీ అవాలని అసలు లేదు అని రాజకీయ విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు.

**మోడీ మీద ఆరాధన :**

ప్రధాని మోడీ మీద ఆరాధన జనసేన అధినేతకు ఉండొచ్చు తప్పు లేదు, ఆయన తనకంటూ ఒక కుటుంబం లేకుండా దేశం కోసం అంకితం అయి పనిచేస్తున్న వారు అని కూడా పవన్ కి ఉండొచ్చు. అయితే దానిని మరీ బాహాటంగా చెప్పాల్సిన అవసరం లేదని అంటున్నారు. పైగా బీజేపీ ఒక పార్టీ జనసేన ఒక పార్టీ అన్నది గుర్తెరగాలి అంటున్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు ఓపెనింగ్ లో మోడీ మీద పవన్ ఆరాధనాభావం అయితే పీక్స్ కి వెళ్ళిందని అంటున్నారు. మోడీని అంటే కన్నీళ్ళు వచ్చాయని ఆయన చెబుతున్నారు. అయితే దానికి ముందూ వెనకా ఎన్నో జరిగాయని కూడా విశ్లేషించుకోవాలి కదా అంటున్నారు. విద్యార్థుల ఉద్యమం ఏకంగా పాతిక రోజులకు పైగా నడిచింది. వారి మీద పోలీసులు దాడి చేశారు. దానికి ప్రతిస్పందనగా అలా మోడీని టార్గెట్ చేయడం జరిగింది అని ఆ వైపు నుంచి వస్తోంది. ఇక జెన్ జీ యూత్ అయితే పవన్ వ్యాఖ్యల మీద సోషల్ మీడియా వేదికగా కామెంట్స్ చేస్తున్నారు.

**శాశ్వత ప్రధానిగా మోడీ :**

మోడీయే ఎల్లకాలం ప్రధాని అన్నది పవన్ భావన కావచ్చు, ధీమా కావచ్చు, కానీ రాజకీయాల్లో ఎపుడేమి జరుగుతుందో ఎవరికీ తెలియదు అంటారు. అందువల్ల 2029 లో మోడీ బీజేపీ పరిస్థితి ఏంటి అన్నది కూడా చూడాల్సి ఉంటుంది. మోడీ శాశ్వత ప్రధానిగా ఉంటే దేశానికి మేలు అన్నది పవన్ అభిప్రాయం కావచ్చు, కానీ రాజకీయాల్లో ప్రజాస్వామ్యంలో మార్పు సహజం. అందుకే పవన్ మాటలకు కాంగ్రెస్ వంటి పార్టీల నుంచి రియాక్షన్ వస్తోంది అని అంటున్నారు.

**జనసేనకు అండగా :**

జనసేనకు బీజేపీ అండగా ఉంది అన్నది నిజం. ముఖ్యంగా మోడీ పవన్ ని బాగా ఆదరించి అభిమానిస్తున్నారు. కానీ ఎల్ల కాలం ఈ రకమైన పరిస్థితి ఉండకపోవచ్చు అని అంటున్నారు. రేపటి రోజున దేశ రాజకీయ ముఖ చిత్రం మారినపుడు దానికి అనుగుణంగా ఏ పార్టీ అయినా తమ సొంత వ్యూహాలను అజెండాను యాక్షన్ ప్లాన్ ని తయారు చేసుకోవాల్సి ఉంటుందని అంటున్నారు. దాంతో పాటుగా జనసేనను సొంత లక్ష్యాలతో అధికారానికి దగ్గర చేయడానికి ప్రయత్నం చేయాలని కోరుతున్న హితైషులు కూడా ఉన్నారు. మొత్తానికి సందర్భం కాకపోయినా పవన్ తన అభిమానాన్ని మోడీ పట్ల చాటుకున్నారు. ఇపుడు మోడీ ప్రత్యర్థులకు అవి ఏ మాత్రం నచ్చడం లేదని అంటున్నారు. అందుకే రాజకీయాల్లో ఆచీ తూచీ మాట్లాడాలని కూడా సూచనలు వస్తున్నాయి.

# రవాణా శాఖలో అనవసర నిబంధనలు తొలగించండి

- మొదటి పేజి తరువాయి

దృష్టి సారించాలని ఆదేశించారు. రిజర్వాయర్లలో నీటి లభ్యతను ఎప్పటికప్పుడు గమనిస్తూ, తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. ఎగువ రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తున్నందున కృష్ణా బేసిన్‌లోకి నీటి లభ్యత పెరిగే అవకాశం ఉందని, కృష్ణా, గోదావరి నదుల నుంచి వచ్చే వరద జలాలను సద్వినియోగం చేసుకునేలా సమర్థవంతమైన నీటి నిర్వహణ చేపట్టాలని దిశానిర్దేశం చేశారు.

వర్షాభావం కారణంగా భవిష్యత్తులో పశుగ్రాసం కొరత ఏర్పడే అవకాశం ఉందని, దీనికి అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. మున్సిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి నాణ్యతను తరచూ పరీక్షించాలని, ల్యాబ్ నివేదికలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# “మిస్టర్ డ్రామారావు” అంటూ కేటీఆర్ పై మంత్రి పొంగులేటి ఫైర్

- మొదటి పేజి తరువాయి

పెద్ది సుదర్శన్ రెడ్డి మరణాన్ని కేటీఆర్ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని ఆరోపిస్తూ సోమవారం ‘ఎక్స్’ వేదికగా ఘాటు విమర్శలు చేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి జీవించి ఉన్నప్పుడు ఆయన్ని విస్మరించి, ఇప్పుడు ఆయన మరణంపై రాజకీయం చేస్తున్న ‘మిస్టర్ డ్రామారావు’ కేటీఆర్ అంటూ పొంగులేటి మండిపడ్డారు.పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం, ఉద్యమకారుడైన పెద్ది సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వకుండా అవమానించిందని పొంగులేటి ఆరోపించారు. ఎమ్మెల్యేగా ఓటమి పాలైన తర్వాత ఆయనకు కనీసం రాజ్యసభ లేదా ఎమ్మెల్సీ పదవి అయినా ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. సంతోష్ రావు, దామోదర్ రావు వంటి వారికి పదవులు కట్టబెట్టిన బీఆర్ఎస్ నాయకత్వం, పెద్ది సుదర్శన్ రెడ్డిని ఎందుకు విస్మరించిందని ఆయన ప్రశ్నించారు.

తమ కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ది సుదర్శన్ రెడ్డిని వైద్య చికిత్స కోసం వరంగల్ నుంచి హైదరాబాద్‌కు తరలించేందుకు గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేసిందని, ఆయన అంత్యక్రియలను అధికారిక పోలీసు లాంఛనాలతో నిర్వహించి గౌరవించిందని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గుర్తుచేశారు. ఉద్యమకారులను కేవలం ఓట్ల కోసం వాడుకుని, అధికారం, కీలక పదవులన్నీ కల్వకుంట్ల కుటుంబమే

అనుభవించడం బీఆర్ఎస్‌కు అలవాటుగా మారిందని ఆయన ఆరోపించారు. మరణాలను సైతం రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటున్న బీఆర్ఎస్ పార్టీకి రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలు మరోసారి గుణపాఠం చెప్పడం ఖాయమని పొంగులేటి ధ్వజమెత్తారు.

# కర్ణాటక కేబినెట్ విస్తరణ: చివరి నిమిషంలో మార్పులతో కాంగ్రెస్‌లో అసమ్మతి జ్వాలలు

కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన మంత్రివర్గ విస్తరణ ఆ పార్టీలో తీవ్ర అసంతృప్తిని, అంతర్గత విభేదాలను రాజేసింది. మంత్రి పదవుల ఖరారులో కాంగ్రెస్ అధిష్ఠానం చివరి నిమిషంలో మార్పులు చేయడంతో, పదవులు ఆశించి భంగపడిన పలువురు ఎమ్మెల్యేలు బహిరంగంగానే తమ నిరసన వ్యక్తం చేస్తున్నారు. కొందరు రాజీనామాకు సిద్ధమవగా, మరికొందరి మద్దతుదారులు ఆందోళనలకు దిగారు.

సోమవారం నాడు మొత్తం 20 మంది శాసనసభ్యులతో మంత్రివర్గాన్ని విస్తరించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. అయితే, తుది జాబితా నుంచి మంకాల్ ఎస్. వైద్య పేరును తొలగించి, ఆయన స్థానంలో సీనియర్ లింగాయత్ నేత, మాజీ మంత్రి ఎస్.ఎస్. మల్లికార్జున్‌ను చేర్చడం వివాదానికి దారితీసింది. ప్రాంతీయ, సామాజిక సమీకరణాలను సమతుల్యం చేసేందుకే ఈ మార్పు చేసినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.మంత్రి పదవి దక్కకపోవడంపై ఇండి నియోజకవర్గ ఎమ్మెల్యే యశ్వంత్ రాయగౌడ పాటిల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరి నిమిషం వరకు హామీ ఇచ్చి మోసం చేశారని, ఇది తనపై జరిగిన పెద్ద కుట్ర అని ఆయన ఆరోపించారు. స్పీకర్‌కు సమర్పించేందుకు తన రాజీనామా లేఖను కూడా సిద్ధం చేసుకున్నట్లు వెల్లడించారు. మరో ఎమ్మెల్యే, మాజీ మంత్రి బేలూరు గోపాలకృష్ణ సైతం తన శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేస్తానని ప్రకటించారు. పార్టీకి విధేయులుగా ఉన్న వారిని విస్మరించి, రాజకీయ పలుకుబడి ఉన్న కుటుంబాలకే ప్రాధాన్యం ఇచ్చారని ఆయన విమర్శించారు.వీరితో పాటు సీనియర్ నేతలు హంపనగౌడ బదర్లి, అశోక్ పట్టణ్, రాఘవేంద్ర హిట్నాల్ వంటి వారు కూడా తీవ్ర నిరాశ వ్యక్తం చేశారు. మరోవైపు, ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన తన్వీర్ సేఠ్‌కు మంత్రి పదవి ఇవ్వలేదన్న మనస్తాపంతో ఆయన అనుచరుడు ఒకరు విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం అక్కడ నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులకు అద్దం పడుతోంది. ఈ పరిణామాల మధ్యే నేడు సాయంత్రం లోక్ భవన్ ప్రాంగణంలో కొత్త మంత్రుల ప్రమాణ స్వీకారం కార్యక్రమం జరిగింది.

# నిమ్స్‌లో 1000 రోబోటిక్ సర్జరీలు.. దేశంలోనే కొత్త రికార్డ్!

- మొదటి పేజి తరువాయి

సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, సర్జికల్ ఆంకాలజీ, అనస్థీషియాలజీ, నర్సింగ్, ఆపరేషన్ థియేటర్ సిబ్బందిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి (నిమ్స్ పాలకమండలి అధ్యక్షుడు) ప్రత్యేకంగా అభినందించారు.మొత్తం 1000 శస్త్రచికిత్సలలో యూరాలజీ విభాగం 590, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ 248, సర్జికల్ ఆంకాలజీ 162 సర్జరీలు నిర్వహించాయి. వీటిలో 90 శాతానికి పైగా ఆపరేషన్లను ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) పథకాల ద్వారా ఉచితంగా అందించడం గమనార్హం. రాడికల్ ప్రోస్టేటెక్టమీ, రాడికల్ సిస్టెక్టమీ, క్లిష్టమైన రోబోటిక్ రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ వంటి అత్యంత సంక్లిష్టమైన శస్త్రచికిత్సలను వైద్య బృందం విజయవంతంగా పూర్తి చేసింది. రోబోటిక్ శస్త్రచికిత్సల వల్ల కచ్చితత్వం మెరుగుపడుతుందని, శస్త్రచికిత్స అనంతరంద

నొప్పి, రక్తస్రావం తగ్గడంతో పాటు రోగులు వేగంగా కోలుకుని డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉంటుందని వైద్యులు తెలిపారు. సామాన్య పౌరులకు అత్యుత్తమ వైద్య సేవలను చేరువ చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొంటూ నిమ్స్ బృందాన్ని ప్రశంసించారు.

# కడప ఎయిర్‌పోర్ట్ లంచం కేసు: మాజీ అధికారికి మూడేళ్ల కఠిన కారాగారం

కడప ఎయిర్‌పోర్ట్‌లో తొమ్మిదేళ్ల క్రితం నమోదైన లంచం కేసులో కర్నూలులోని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం సోమవారం కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న ఎయిర్‌పోర్ట్ మాజీ అధికారికి మూడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 50,000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది.

వివరాల్లోకి వెళితే, కడప ఎయిర్‌పోర్ట్‌లో అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (ఎయిర్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్)గా, తాత్కాలిక ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్‌గా పనిచేసిన ముకుందగిరి రంగాచారి శ్రీనివాసన్, ఓ కాంట్రాక్టర్‌ను లంచం డిమాండ్ చేశారు. ఆ కాంట్రాక్టర్‌కు రావాల్సిన పెండింగ్ బిల్లులను త్వరగా ప్రాసెస్ చేసేందుకు, అతని సంస్థను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టకుండా ఉండేందుకు రూ. 50,000 లంచం ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంపై బాధితుడు సీబీఐని ఆశ్రయించడంతో 2015 జూలై 24న శ్రీనివాసన్‌పై కేసు నమోదైంది. అనంతరం, లంచంలో మొదటి విడతగా రూ. 25,000 నగదు తీసుకుంటుండగా సీబీఐ అధికారులు ఆయన్ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. తన అధికారిక హోదాను దుర్వినియోగం చేసి లంచం డిమాండ్ చేసినట్లు సీబీఐ తన దర్యాప్తులో నిర్ధారించింది. ఈ కేసుకు సంబంధించి లోతైన దర్యాప్తు జరిపిన సీబీఐ, 2016 ఫిబ్రవరి 29న కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసింది. సుదీర్ఘ విచారణ అనంతరం, తాజాగా సాక్ష్యాధారాలను పరిశీలించిన కర్నూలు సీబీఐ ప్రత్యేక కోర్టు.. శ్రీనివాసన్‌ను దోషిగా నిర్ధారిస్తూ పైవిధంగా శిక్ష ఖరారు చేసింది. ఈ మేరకు సీబీఐ ఒక ప్రకటనలో వివరాలను వెల్లడించింది.

## మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపుల కేసులో తీర్పు.. నిర్దోషిగా బ్రిజ్ భూషణ్

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపుల ఆరోపణల కేసులో భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ అధ్యక్షుడు, బీజేపీ నేత బ్రిజ్ భూషణ్ శరన్ సింగ్‌కు భారీ ఊరట లభించింది. ఈ కేసులో ఆయనను, మరో నిందితుడు వినోద్ తోమర్‌ను నిర్దోషులుగా తేలుస్తూ ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు నేడు తీర్పు వెలువరించింది. దీంతో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కేసుకు తెరపడినట్లయింది.తీర్పు వెలువడిన వెంటనే బ్రిజ్ భూషణ్ ‘ఎన్డీటీవీ’తో మాట్లాడుతూ తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. “నాపై ఆరోపణలు వచ్చిన రోజే చెప్పాను.. అవి రుజువైతే ఉరి వేసుకుంటానని. ఈ రోజు కోర్టు నన్ను గౌరవప్రదంగా నిర్దోషిగా తేల్చింది. జరిగిందేదో జరిగిపోయింది” అని ఆయన వ్యాఖ్యానించారు.డబ్ల్యూఎఫ్ఐ చీఫ్‌గా ఉన్నప్పుడు బ్రిజ్ భూషణ్ తమపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ పలువురు మహిళా రెజ్లర్లు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నిరసనల నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. విచారణ పూర్తి చేసిన అనంతరం 2023 జూన్ 15న సుమారు 1500 పేజీల ఛార్జిషీట్‌ను కోర్టులో దాఖలు చేశారు.

భారత రెజ్లింగ్ సమాఖ్య అధిపతిగా ఉన్న సమయంలో స్వదేశీ, విదేశీ మహిళా రెజ్లర్ల పట్ల బ్రిజ్ భూషణ్ అసభ్యంగా ప్రవర్తించారని ఆరోపణలు వచ్చాయి. సుదీర్ఘ విచారణ అనంతరం కోర్టు ఆయనను, సహ నిందితుడు వినోద్ తోమర్‌ను నిర్దోషులుగా ప్రకటిస్తూ తీర్పు ఇచ్చింది.

# టీటీడీ ఆసుపత్రుల్లో మందుల కొనుగోళ్లలో భారీ అవినీతి

- మొదటి పేజి తరువాయి

చేసుకుంటున్నారని ఆరోపించారు.మంత్రి నారా లోకేశ్ అమలు చేస్తున్న ‘రెడ్ బుక్’ రాజ్యాంగం వల్లే రాష్ట్రంలో హింస, అవినీతి కరాళ నృత్యం చేస్తున్నాయని భూమన విమర్శించారు. ప్రాణరక్షక మందుల కొనుగోళ్ల వెనుక ఉన్న ఈ దిగజారుడు కుట్రపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

# ‘గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఏపీ’ పనుల్లో వేగం పెంచండి

- మొదటి పేజి తరువాయి

ఈ ఏడాది మడ అడవులు ఎంత విస్తీర్ణంలో నాటనున్నారు? తదితర వివరాలను అంశాల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రేట్ గ్రీన్ వాల్ లక్ష్యసాధనలో భాగంగా గత రెండేళ్లలో సాధించిన పురోగతికి జాతీయ స్థాయి గుర్తింపు లభించిన అంశాన్ని పవన్ గుర్తు చేశారు. మడ అడవుల విస్తరణలో దేశంలో రెండో స్థానం సాధించేందుకు కృషి చేసిన అధికారులకు అభినందనలు తెలిపారు.

# డీల్ కుదుర్చుకోండి.. లేదా లొంగిపోండి

- మొదటి పేజి తరువాయి

తప్ప ఇరాన్‌కు ఏదీ చేరదు. ఆ దేశం వద్ద ఎప్పటికీ అణ్వాయుధం ఉండదు” అని ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దాడులు ఆపాలని తమ బలగాలను ఆదేశించానని చెప్పిన సంగతి తెలిసిందే. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత జరగబోయే అతిపెద్ద దాడికి అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేశానన్న ట్రంప్.. గల్ఫ్‌లోని మిత్రదేశాలైన ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ విజ్ఞప్తి మేరకు తన నిర్ణయాన్ని వాయిదా వేసుకున్నట్లు చెప్పారు. ఆయా దేశాల ఉన్నతాధికారులతో మాట్లాడిన తర్వాత ఇరాన్‌తో దౌత్యానికి మరింత అవకాశం ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.ఒప్పందం ఖరారు కాకపోతే మళ్లీ దాడులకు దిగుతామని హెచ్చరించారు. కాగా, ఇరాన్ విదేశాంగశాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి.. ట్రంప్ వ్యాఖ్యలను కొట్టిపారేశారు. వాషింగ్టన్‌తో చర్చలు జరపడం లేదని చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్న ఏకైక చర్చలు జలసంధికి అవతలి వైపున ఉన్న ఒమన్‌తో మాత్రమేనని చెప్పారు. అది కూడా హర్మూజ్ గుండా తాత్కాలిక సురక్షిత నౌకాయాన మార్గాన్ని ఏర్పాటు చేయడం వరకేనని స్పష్టం చేశారు. ఈ నేపథ్యలో ట్రంప్ హెచ్చరికలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## బీజేపీకి భారీ షాక్.. బంకీపూర్ కోట బద్దలు కొట్టిన ప్రశాంత్ కిశోర్

- మొదటి పేజి తరువాయి

ఉప ఎన్నికలో ఆయన ఘన విజయం సాధించారు. దాదాపు మూడు దశాబ్దాలుగా బీజేపీకి కంచుకోటగా ఉన్న ఈ స్థానంలో, ఆ పార్టీ అభ్యర్థి నీరజ్ కుమార్ సిన్హాపై సుమారు 19,324 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించి అందరినీ ఆశ్చర్యపరిచారు.సోమవారం జరిగిన ఓట్ల లెక్కింపులో మొత్తం 32 రౌండ్ల ముగిసేసరికి ప్రశాంత్ కిశోర్‌కు 64,151 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్‌కు 44,827 ఓట్లు పోలయ్యాయి. ఇక ఆర్జేడీ అభ్యర్థి రేఖా కుమారి 14,273 ఓట్లతో మూడో స్థానానికే పరిమితమయ్యారు. ఈ విజయంతో ప్రశాంత్ కిశోర్ తొలిసారిగా అసెంబ్లీలో అడుగుపెట్టనున్నారు. ఆయన స్థాపించిన జన సురాజ్ పార్టీకి సైతం ఇదే తొలి ఎన్నికల విజయం కావడం విశేషం.బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ రాజ్యసభకు ఎన్నిక కావడంతో బంకీపూర్ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. 1995 నుంచి (గతంలో పట్నా పశ్చిమ స్థానంగా పిలిచేవారు) ఈ నియోజకవర్గం బీజేపీకి తిరుగులేని కోటగా ఉంది. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జన సురాజ్ పార్టీ అనేక స్థానాల్లో పోటీ చేసినప్పటికీ ఒక్క చోట కూడా విజయం సాధించలేకపోయింది. ఈ నేపథ్యంలో పీకే సాధించిన విజయం ఆ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.ఈ ఫలితంపై బీహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి, మంత్రి విజయ్ కుమార్ సిన్హా స్పందిస్తూ, ప్రజా తీర్పును గౌరవిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రశాంత్ కిశోర్‌కు అభినందనలు తెలియజేశారు. ఈ ఉప ఎన్నికలో కేవలం 34.30 శాతం మాత్రమే పోలింగ్ నమోదు కావడం గమనార్హం. పాట్నా లాంటి పట్టణ ప్రాంతంలో, బీజేపీకి అత్యంత పట్టున్న స్థానంలో ప్రశాంత్ కిశోర్ విజయం సాధించడం ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

# రాయలసీమ వనరులు తీవ్రంగా దోపిడీకి గురయ్యాయి

- మొదటి పేజి తరువాయి

బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సీమ ప్రాంత స్థితిగతులు, ఎదుర్కొంటున్న సవాళ్లు మరియు భవిష్యత్ కార్యాచరణపై ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి రాయలసీమ ప్రాంతం తీవ్ర వెనుకబాటుతనానికి గురైందని, ఇక్కడి ప్రాకృతిక, మానవ వనరులు దోపిడీకి గురయ్యాయని అన్నారు. ఈ ప్రాంతం నుంచి ఎందరో ముఖ్యమంత్రులు ప్రాతినిధ్యం వహించినప్పటికీ.. రాయలసీమ అభివృద్ధిలో ఎందుకు వెనుకబడిపోయిందో అర్థం కాని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వెనుకబాటుతనాన్ని అధిగమించేందుకు నాయకులు, మేధావులు ఒకే తాటిపైకి వచ్చి సీమ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రచించాలని పిలుపునిచ్చారు.సీమ పురోగతి కోసం ఆయన ‘ప్రజలు, పాడిపంటలు, పరిశ్రమలు, పర్యటకం, పర్యావరణం’ విధానాన్ని సూచించారు. వచ్చే 20 ఏళ్లలో రాయలసీమను ఏ విధంగా అభివృద్ధి చేయాలనే దానిపై సమగ్ర డాక్యుమెంటరీని రూపొందించడమే కాకుండా, దాన్ని ఆచరణలో సాధించి తీరాలని అన్నారు.

పెన్ పవర్
మార్కాపురం - ప్రకాశం

## ఇన్ ప్రోగ్రెస్ .. అంటూ ఎన్నాళ్లు సాకులు చెబుతారు..

# అధికారుల తీరుపై కలెక్టర్ ఆగ్రహం







**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 03**

ప్రతి అర్జీ చదివి నియమ నిబంధనలకు లోబడే అర్జీలను పరిష్కరించాలని, ఆగస్టు 15 తరువాత నుంచి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజల నుండి నేరుగా అభిప్రాయాలు తీసుకుంటామని, ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు ప్రజల నుంచి వచ్చే అర్జీలను నిర్దేశిత గడువులోగా, నాణ్యతతో పరిష్కరించాలని, ఇందులో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను హెచ్చరించారు. ముఖ్యంగా రెవెన్యూ శాఖకు సంబంధించిన అర్జీల పరిష్కారంలో ఇన్ ప్రొగ్రెస్ (ప్రగతిలో ఉంది) అని చూపుతూ కాలయాపన చేసే ధోరణిని సహించబోమని, పెండింగ్ అర్జీలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' హాలులో సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన ప్రజల నుంచి కలెక్టర్ స్వయంగా వినతిపత్రాలను స్వీకరించి, ఆయా సమస్యలపై అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. ?ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మీకోసం కార్యక్రమం ద్వారా 332 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆగస్టు 15 తరువాత నుంచి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజల నుండి నేరుగా అభిప్రాయాలు తీసుకుంటామని దీనిపై అధికారులతో చర్చిస్తామని ఆయన చెప్పారు.అధికారుల వద్ద ఇన్ ప్రొగ్రెస్ లో ఉన్న కేసుల సంఖ్యను తక్షణమే తగ్గించాలని, పెండింగ్‌లో ఉన్న ప్రతి అర్జీని త్వరగా పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. పిటిషన్లను పరిష్కరించే క్రమంలో ప్రతీ అర్జీని చదివి నియమ నిబంధనలకు లోబడి మాత్రమే అర్జీలను పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. కేవలం ఆన్‌లైన్ రికార్డుల కోసం అర్జీలను మమ అనిపించకుండా, బాధితుడికి సంతృప్తికరమైన, శాశ్వతమైన పరిష్కారం లభించేలా క్షేత్రస్థాయి అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని స్పష్టం చేశారు. ?ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరమణ, జిల్లా పరిషత్ సీఈఓ చిరంజీవి, విపత్తుల నిర్వహణ సంస్థ అధికారి మాధురి, బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వర రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మలత, తో పాటు వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి దిశగా పల్లెలు

రెండేళ్లలో ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం:ఎమ్మెల్యే.

చినలాటరిపి గ్రామంలో ఎమ్మెల్యే ఇంటింటి ప్రచారం.

గుడ్లూరు-నరసాపురం రోడ్డు అభివృద్ధికి రూ:4.03 కోట్లు మంజూరు.





**గుడ్లూరు, పెన్ పవర్, ఆగస్ట్ 03:**


దేశానికి పట్టుకొమ్మలు పల్లెలు. అటువంటి పల్లెలను కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తూ, ప్రగతి పథంలోకి తీసుకెళుతుందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి సంక్షేమం కార్యక్రమాన్ని గుడ్లూరు మండలం చినలాటరిపి గ్రామంలో ఆదివారం రాత్రి నిర్వహించగా స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. స్థానిక నేతలతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. ఎస్సీ, ఎస్టీ కాలనీలో ప్రచారం నిర్వహించగా, కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. రెండు సంవత్సరాలలో రాష్ట్రంతో పాటు కందుకూరు నియోజకవర్గం మరియు చినలాటరిపి పంచాయితీలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఎమ్మెల్యే ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ పంచాయతీలో సుమారు 60 లక్షల రూపాయలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, బోర్లు, జీఎస్పీ రోడ్లు నిర్మించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అలాగే పదిమంది పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వైద్య సహాయం అందించామన్నారు. గుడ్లూరు - నరసాపురం మధ్య కొత్తగా రోడ్డు నిర్మాణానికి 4.03 కోట్లు మంజూరు చేయించానని ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలిపారు. టెండర్లు పూర్తయ్యాయని, నెలరోజులు లోపే పనులు మొదలు పెడతారని ఆయన వెల్లడించారు. వైసిపి హయాంలో జరిగిన విధ్వంసాన్ని, కూటమి ప్రభుత్వం వచ్చాక పెద్ద ఎత్తున జరుగుతున్న పురోగతిని ఎమ్మెల్యే వివరించారు. రాజధాని అమరావతి అత్యద్భుతంగా తయారవుతోందని, వచ్చే ఏడాది పోలవరం ప్రాజెక్టు జాతికి అంకితం చేస్తారని చెప్పారు. మన ప్రాంతానికి సాగు, తాగునీరు అందించే వెలిగొండ ప్రాజెక్టు పనులు కూడా త్వరలోనే పూర్తి కాబోతున్నాయని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. మన ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించి, స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని వార్డులు, పంచాయతీలు కైవసం చేసుకునేలా కూటమి పార్టీ నేతలు పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కాపులూరి ప్రసాద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మేకల విజయ, క్లస్టర్ ఇన్చార్జిలు చిత్తారు మల్లికార్జున, ఉమ్మనేని సుబ్బారావు, స్థానిక నాయకులు మేకల మాల్యాద్రి, నూతలపాటి తిరుపతి వెంకయ్య, చిట్యాల యానాది, కాపులూరి విజయ్, ఏసుదాసు, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు జొన్నలగడ్డ రమణమ్మ, యూనిట్ ఇంచార్జ్ పోలుగంగు కృష్ణ, అన్ని గ్రామ పార్టీల అధ్యక్షులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు

గ్రామాలలో చిన్నపాటి వర్షానికే చెరువులను తలపిస్తున్న సిసి రోడ్లు.

సి పీ ఎం నాయకులు అవులయ్య





**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 03**

గిద్దలూరు మండలం ముళ్ల పాడు సచివాలయానికి దగ్గర లో పోరుమామిళ్ల గిద్దలూరు రాష్ట్ర రహదారి పైనే మురుగునీరు చేరడంతో అటుగా పోతున్న విద్యార్థులు ,వృద్ధులు ,గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గ్రామాలలో పంచాయతీ సెక్రెటరీ గ్రామాలలో నివాసముండకపోవటం వలన రోడ్లపై చేరిన మురుగు ను నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి ఎక్కువమంది సెక్రెటరీ ఆయా గ్రామాలలో పారిశుధ్య నిర్వహించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. కొమరోలు మండలం రాజుపాలెం గ్రామపంచాయతీలో ఆ పంచాయతీ సెక్రెటరీ లకు ఎన్నిసార్లు చెప్పినా సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. అభివృద్ధి జపం చేస్తున్న కూటమి ప్రభుత్వ నాయకులకు ఆయా గ్రామాలలో ఉన్న పారిశుధ్యం నిర్వహణ పట్టట్లేదని అన్నారు. ఇప్పటికైనా ఆయా మండలాల అధికారులు ఆ గ్రామాలలో పర్యటన చేసి సమస్యను పరిష్కారం చేయాలన్నారు.

# అద్దంకికి రూ. 101.96 కోట్లతో రక్షిత మంచినీటి పథకం

పబ్లిక్ హెల్త్ అధికారులతో

మంత్రి గొట్టిపాటి సమీక్ష.

పనుల్లో నాణ్యతా లోపాలు

ఉంటే సహించేది లేదు.



**అద్దంకి, ఆర్.సి(పెన్ పవర్) ఆగస్టు 03**

అద్దంకి పట్టణ ప్రజలకు దీర్ఘకాలికంగా తాగునీరు అందించే లక్ష్యంతో రక్షిత మంచినీటి పథకం పనులను యుద్ధ ప్రాతిపదికన వేగవంతం చేయాలని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి. రవికుమార్ అధికారులను ఆదేశించారు. పుట్టావారిపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో పబ్లిక్ హెల్త్ అధికారులతో ఆయన ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాగునీటి పథకం పనుల పురోగతి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

**భారీ సామర్థ్యంతో నీటి నిల్వ ట్యాంకులు..**


అద్దంకి పట్టణంలో రూ. 101.96 కోట్ల వ్యయంతో ఇప్పటికే పనులు ప్రారంభమైనట్లు అధికారులు వివరించారు. ప్రజల భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా 51 లక్షల లీటర్ల సామర్థ్యం గల నీటి నిల్వ ట్యాంకులను నిర్మించాలని మంత్రి సూచించారు. ప్రతిరోజూ 12 మిలియన్ లీటర్ల నీటిని శుద్ధి చేసేలా వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణంతో పాటు, 83 కిలోమీటర్ల మేర నీటి సరఫరా పైప్‌లైన్, 15 కిలోమీటర్ల ఫీడర్ ఛానెల్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు.

**చెరువు పరిరక్షణతో పాటు సుందరీకరణ..**

అద్దంకి పట్టణ పరిధిలోని ఊరచెరువును రూ. 5.10 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసి, నీటి వనరులను పరిరక్షించడంతో పాటు నడక దారులు, సుందరీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణ పనుల్లో ఎక్కడా నాణ్యతా లోపాలు లేకుండా పకడ్బందీగా పర్యవేక్షించాలని, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు.

# గాయత్రి మాతకు శాకాంబరీ అలంకారం

అమ్మవారికి ఆశాడపట్టి సమర్పణ



**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 03**

గిద్దలూరు పట్టణం లో ని కాశీరెడ్డి నాయన ఆశ్రమం లో గల గాయత్రి మాత ఆలయంలో సోమవారం నాడు గాయత్రి మాత శాకాంబరి అలంకారం లో భక్తుల కు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా ముత్తై దువులు గాయత్రి అమ్మ వారికి పసుపు కుంకుమ లు ఆషాఢ పట్టి ని సమర్పించి భక్తి ప్రపతులు చాటుకున్నారు. శాకాంబరీ అమ్మ వారు దుర్గా దేవి అవతారం దుర్మాసురుణ్ణి వధ శాకాంబరీ దేవి మహిమల కు సంబంధించినది. లోకం లో కరువు ను రూపు మాపి శాఖకాహారాన్ని,జీవనాశనాన్ని ప్రసాదించిన దైవం గా ఈ అమ్మ వారిని పూజిస్తారు. పూర్వం దుర్గమాసురుడు అనే రాక్షసుడు త్రీవ్ర మైన తపస్సు చేసి మహిమలని సంపాదించి వేదాలను మరుగున పడిపోయేలా చేశారు. దాంతో యజ్ఞ యాగాలు నిలిచిపోయి వర్షాలు కురవక భూమి పై సంవత్సరాలు గా కరువు కరాల నృత్యం చేసింది. ప్రజలు నీరు ఆహారం లేక ప్రజలు, మునులు త్రీవ్ర ఇబ్బందుల కు గురయ్యారు. ఆ సమయంలో సమస్త లోకాలను రక్షించమని ఆది శక్తి ని ప్రార్ధించారు . శతాక్షి,శాకాంబరీ అవతారం భక్తుల దీన స్థితి చూసి జగన్మాత తన కంటి నుండి కన్నీటి దారాలను కురపించించింది.ఆ కన్నీటితో నదులు పొంగి పొర్లి భూమి తడిసి సస్యశ్యామలం అయ్యింది. అమ్మ వారు తన శరీరం నుండి అనేక రకాల ఆకుకూరలు పండ్ల ను ప్రసాదించి లోకం లో ని




ప్రాణులకు అందించింది.కండ్ల తో భక్తుల ను చూసింది కాన శతాక్షి అని శాఖహారాన్ని భోజనం గా ఇచ్చి ప్రాణుల ను పోషించింది గనుక శాఖశీభరి గా పెరు గాంచింది. దుర్గమాసురుడు అనే రాక్షసురుణ్ణి వధించి లోకానికి శాంతిని చేకూర్చింది. ఆషాడ మాసం లో వచ్చే పౌర్ణమి ముందు మూడు రోజులు ,ఆషాడ శుద్ధ అష్టమి నుండి పౌర్ణమి వరకు అమ్మ వారికి కూరగాయ ల తో ఆకుకూరలు పండ్ల తో అలంకరించి ప్రేత్యేక పూజలు నిర్వహించి ఆషాడ పట్టీలు సమర్పిస్తారు. ఆ క్రమం లో నే నేడు గాయత్రి మాత కు శాకాంబరి అలంకారం చేసి పూజలు నిర్వహించి ఆషాడ పట్టి సమర్పించి భక్తులు పునీతులులయ్యారు.

# వీఆర్వో బడేసాబ్ 150 ఎకరాల ఆక్రమణ

నకిలీ పట్టా పాస్‌పుస్తకాలపై విచారణ చేయాలి

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన స్థానికుడు అబ్దుల్ గఫార్

**మార్కాపురం**
**పెన్ పవర్ ఆగస్టు3**




గత 15 ఏళ్లుగా రెవెన్యూ అక్రమాలపై పోరాటం చేస్తున్నానని, తనకు న్యాయం చేయాలని స్థానికుడు అబ్దుల్ గఫార్ జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీతకు సోమవారం వినతి పత్రం అందజేశారు.కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసిన అబ్దుల్ గఫార్ సర్వే నంబర్లు 345, 346, 347లో అక్రమ ఆన్‌లైన్ నమోదులు జరిగాయని ఆరోపించారు. వీఆర్వో బడేసాబ్ 150 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించారని, దరిమడుగు గ్రామంలో నకిలీ పట్టా పాస్‌పుస్తకాలు సృష్టించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.తన వద్ద ఈ అక్రమాలకు సంబంధించిన పూర్తి ఆధారాలు ఉన్నాయని తెలిపారు. భూమి వద్దకు వెళ్లినప్పుడు తనను కొందరు బెదిరిస్తున్నారని వాపోయారు. వెంటనే ఉన్నతాధికారులతో విచారణ జరిపించి, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని, తనకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వ భూములను కాపాడేందుకు తాను 15 ఏళ్లుగా పోరాడుతున్నానని, కానీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫిర్యాదుపై కలెక్టర్ స్పందించి సంబంధిత అధికారులకు విచారణ ఆదేశాలు జారీ చేస్తారని ఆశిస్తున్నానని గఫూర్ తెలిపారు.

# గిద్దలూరు హైస్కూల్లోని ఎన్.సి.సి ఆధ్వర్యంలో "ఏక్ పేడ్ మాకే నామ్"

## మొక్కలు నాటుతున్న ఎన్.సి.సి ఆఫీసర్



**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 03**

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ లోని ఎన్.సి.సి ఆధ్వర్యంలో సోమవారం " ఏక్ పెడ్ మాకే నామ్" కార్యక్రమంలో భాగంగా 10 మొక్కలను ఎన్.సి.సి కేర్ టేకర్ ఆఫీసర్ గా పనిచేస్తున్న డాక్టర్ మొర్రి. పిచ్చయ్య ఎన్.సి.సి క్యాడెట్లతో వృక్షారోహణ కార్యక్రమం నిర్వహించారు. "తల్లి పేరుతో ఒక్క మొక్కను నాటి ప్రకృతిని రక్షిద్దాం- భవిష్యత్తు తరాలకు పచ్చని భూమిని అందిద్దాం" అనే సందేశంతో మొక్కలను నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, ఇలాంటి కార్యక్రమాలలో ప్రజలు భాగస్వాములు కావాలని కేర్ టేకర్ ఆఫీసర్ గా వ్యవహరిస్తున్న డాక్టర్ మొర్రి. పిచ్చయ్య ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ యం.సిద్దేశ్వర శర్మ పాల్గొని పర్యావరణ పరిరక్షణలో చెట్ల యొక్క ఆవశ్యకతను తెలిపారు. ఈ కార్యక్రమంలో బాల గురువయ్య, స్వామి కుమార్, శ్రీ రామి రెడ్డి, పీరయ్య,శ్రీనివాసరెడ్డి మరియు పాఠశాల సిబ్బంది పాల్గొని పాఠశాల ఆవరణలో మొక్కలను నాటించటం జరిగింది.

# పోషకాహార పంపిణీలో రాజీ వద్దు

**చెరువుకొమ్ముపాలెం అంగన్‌వాడీలో**

**మంత్రి గొట్టిపాటి తనిఖీలు**

**బాలింతలకు పౌష్టికాహార కిట్ల అందజేత**





**అద్దంకి, ఆర్.సి(పెన్ పవర్) ఆగస్టు 03:**

ప్రకాశం జిల్లా, అద్దంకి మండల పరిధిలోని చెరువుకొమ్ముపాలెంలో రాష్ట్ర మంత్రి గొట్టిపాటి. రవికుమార్ సోమవారం పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. కేంద్రంలో చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు సిబ్బంది ద్వారా అందుతున్న సేవలను స్వయంగా పరిశీలించారు. అనంతరం బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార కిట్లను మంత్రి తన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కిట్లలోని సరుకుల నాణ్యతను పరిశీలించి, వాటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. తల్లీబిడ్డల ఆరోగ్యానికి పౌష్టికాహారం ఎంతో అవసరమని, పంపిణీ చేసే ఆహారం నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని సంబంధిత అధికారులకు ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

# పొదిలి మునిసిపల్ కమిషనర్‌ను కలసిన బిజెపి నాయకులు

**పొదిలి, పెన్ పవర్, ఆగస్టు 3**

పొదిలి మునిసిపల్ కమిషనర్ రామ్మోహనరావును బిజెపి నాయకులు కలుసుకున్నారు. కమిషనర్ రామ్మోహనరావు ఇటీవలనే బదిలీపై వచ్చి తన ఉద్యోగ బాధ్యతలను చేపట్టడం జరిగింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని పలువురు బిజెపి నాయకులు సోమవారం నాడు మునిసిపల్ కమిషనర్ ఛాంబర్ లో కమిషనర్ ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అలాగే కమిషనర్ ను శాలువా, పూలదండతో సత్కరించి, తమ శుభాకాంక్షలు తెలియజేశారు. కమిషనర్ ను కలసిన వారిలో బిజెపి నాయకులు సయ్యద్ ఖాదర్ భాష, నాగేశ్వరరావు, రమణారెడ్డి, పీరా, భాష తదితరులు ఉన్నారు.



# పొగాకు రైతుల రాస్తారోకో

**కందుకూరు పెన్ పవర్, ఆగస్టు 3**

పొగాకు కు కనీస మద్దతు ధర రాకపోవటంతో పొగాకు రైతులు నిరాశ చెంది, సోమవారం ఉదయం చుండి క్లస్టర్ రైతులు వేలం ని ఆపేశారు. ప్రైవేట్ వ్యాపారులు 27 వేలం కేంద్రంలో కిలోకి ధర 160 మాత్రమే ఇచ్చారు. నో బిడ్ లు వేసి రైతులను వెనక్కి పంపడంతో, వేలం ప్రారంభమైన 15 నిమిషాల్లోనే మొదటి లైన్ పూర్తికాకుండానే రైతులు వేలాన్ని నిలిపివేశారు. బయటికి వచ్చి వేలం కేంద్రం ముందు రోడ్డు పైన బైఠాయించారు. నోబిడ్లు ఆపాలని, కనీస మద్దతు ధర సరాసరి 250 ఇవ్వాలని, 1000 కోట్లు కేటాయించి బోర్డు,సమాఖ్య ద్వారా పొగాకును కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ రాస్తారోకోలో పాల్గొన్న ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జే.జయంతి బాబు మాట్లాడారు. కనీస మద్దతు ధర కోసం జూన్ 13 నుండి రైతులు ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వానికి కనువిప్పు కలవలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గుంటూరు బోర్డు వద్ద రైతుల ఆందోళనతో ఒక కాడ కూడా మిగలకుండా మద్దతు ధర కల్పించి, పొగాకు రైతులను ఆదుకుంటామని బోర్డు అధికారులు చెప్పిన మాట నీటి మూటలైందని పేర్కొన్నారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి 200





తగ్గకుండా ధర కల్పించి కొనమన్నప్పటికీ , వ్యాపారులు ముందుకు రాకపోవడం శోచనీయమన్నారు. బోర్డు అధికారులు, ప్రైవేటు వ్యాపారులతో కుమ్మక్కయి పొగాకు రైతులను దోపిడీ చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ వైఖరి విడనాడాలని కోరారు. నిన్న పొగాకు రైతులను ఉద్దేశించి ఎం.పీ పంపిన వీడియో రైతులకు తీవ్ర నిరాశకు గురిచేసిందన్నారు. బోనస్ ను పది రూపాయలకు తగ్గించటం సరికాదన్నారు. పొగాకు 1000 కోట్లు కేటాయించాలని,పొగాకు వ్యాపారుల దోపిడి ని అరికట్టాలని, కనీస ధర సరాసరి 250 కల్పించి, పొగాకు రైతులను ఆదుకోవాలని, లేనియెడల ఛలో అమరావతి కార్యక్రమాన్ని చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పామూరు రోడ్ లోని 27వ వేలంకేంద్రం వద్ద 40 నిమిషాల పైగా రాస్తారోకో చేశారు. వాహనాలు నిలిచిపోయాయని తెలిపారు. రైతులకు మద్దతుగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి. శ్రీకాంత్, సిఐటియు జిల్లా నాయకులు జీవీబీ కుమార్, రైతులు కామినేని శ్రీనివాసులు, చెరువుపల్లి సాంబయ్య, సంజీవరెడ్డి, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రకాశం సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్స్ మీట్‌కు ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ శ్రీకాంత్



**కందుకూరు, పెన్ పవర్ ఆగస్టు 3**

ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ప్రకాశం జిల్లా సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్స్ మీట్ కార్యక్రమానికి తూర్పు రాయలసీమ ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ ముఖ్య



అతిథిగా హాజరయ్యారు. భారత్ వెల్త్ ఫైనాన్స్ సంస్థ స్పాన్సర్‌గా, జెల్లో మీడియా, కందుకూరు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భారత్ వెల్త్ ఫైనాన్స్ సంస్థ అందిస్తున్న పొదుపు, ఆరోగ్య బీమా సేవలపై అవగాహన కల్పించారు. అనంతరం ఎమ్మెల్సీ డాక్టర్ కె. శ్రీకాంత్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ పొదుపును జీవితంలో భాగం చేసుకోవడంతో పాటు ఆరోగ్య బీమా తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు తమ ప్రభావాన్ని సద్వినియోగం చేసుకుంటూ సమాజంలో మంచి మార్పులకు దోహదపడాలని, బాధ్యతాయుతమైన కంటెంట్‌తో సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.సోషల్ మీడియాలో విశిష్ట సేవలు అందిస్తున్న ప్రకాశం జిల్లా ఇన్‌ఫ్లూయెన్సర్లను ఎమ్మెల్సీ డాక్టర్ కె. శ్రీకాంత్ సన్మానించి అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో ప్రణవి హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నవీన్, ఐసీఐసీఐ బ్యాంక్ కందుకూరు శాఖ మేనేజర్ గంగాధర్, జెల్లో మీడియా హెడ్ వెంకట్, భారత్ వెల్త్ ఫైనాన్స్ ప్రతినిధులు, పలువురు సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు, ప్రముఖులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక, పర్యాటక శోభతో శింగరకొండ

**ఆలయ అధికారుల సమీక్షలో మంత్రి గొట్టిపాటి. రవికుమార్**

**దాతల సహకారంతో నిర్మిస్తున్న గోపురాల నమూనాల పరిశీలన**





**అద్దంకి, ఆర్.సి(పెన్ పవర్) ఆగస్టు 03:**

అద్దంకి, శింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానాన్ని రాష్ట్రంలోనే ప్రముఖ క్షేత్రంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి. రవికుమార్ స్పష్టం చేశారు. సోమవారం ఆయన దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆలయ అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఆలయ కమిటీ సలహాలు, సూచనల మేరకు పనులను వేగవంతం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. క్షేత్రానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, అవసరమైన అన్ని వసతులను దశలవారీగా అందుబాటులోకి తేవాలన్నారు. దేవస్థానం పరిసర ప్రాంతాల సమగ్ర అభివృద్ధితో పాటు, సమీపంలోని భావనాసి చెరువును పర్యాటకులను ఆకర్షించేలా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.

**శిల్పకళ ఉట్టిపడేలా నిర్మాణాలు..**

దాతల సహకారంతో ఆలయంలో నూతనంగా నిర్మిస్తున్న గోపురాలు, ప్రాకారాల నమూనాలను ఈ సందర్భంగా మంత్రి పరిశీలించారు. నిర్మాణాల్లో ఎక్కడా నాణ్యతా లోపాలు లేకుండా, సంప్రదాయ ఆలయ శిల్పకళ ఉట్టిపడేలా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ క్షేత్రాన్ని మరింతగా అభివృద్ధి చేయడం ద్వారా స్థానిక ప్రాంతానికి కూడా గొప్ప మేలు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

# 4..5 తేదీలలో జన జాగృతి సమావేశాలు..

## - గుండ్లకమ్మ హరితహారం ప్రాజెక్టు ఇంచార్జ్ సందిరెడ్డి కొండల రావు వెల్లడి

**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 03**

హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ అధ్యక్షులు, పూర్వపు ప్రకాశం జిల్లా కలెక్టర్ డాక్టర్ దాసరి శ్రీనివాసులు మార్గ దర్శనంలో గుండ్లకమ్మ పరివాహక ప్రాంతంలోని హైస్కూల్ విద్యార్థులకు మొక్కల పెంపకం, నదీ సంరక్షణ, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు గుండ్లకమ్మ హరితహారం ప్రాజెక్టు ఇంచార్జ్ సందిరెడ్డి కొండల రావు వెల్లడించారు. ఆగస్టు 4న ఉదయం 11 గంటలకు ప్రకాశం జిల్లా అద్దంకి మండలం తిమ్మాయపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో, మధ్యాహ్నం 2



గంటలకు అద్దంకి పట్టణంలోని ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో, సాయంత్రం 3 గంటలకు ప్రకాశం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ జన జాగృతి సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆగస్టు 5న ఉదయం 11 గంటలకు దర్శి నియోజకవర్గం, ముండ్లమూరు మండలం మారెళ్ల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అవగాహన కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ఈ బృహత్తర కార్యక్రమంలో ప్రజలు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ ప్రేమికులు భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు.

# సి ఎస్ పురం ఎంఈఓ 2 గా దేవిడ్ బాధ్యతలో స్వీకరణ

**దేవిడ్ ను సన్మానించిన యుటిఎఫ్, ఎస్టియు నాయకులు**






**సి.ఎస్.పురం, పెన్ పవర్ ఆగస్టు 3**

మండల కేంద్రంలోని సి ఎస్ పురం విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం ఎంఈఓ-2గా బూదాల డేవిడ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్, ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ, బూదాల డేవిడ్ విద్యాశాఖలో నిబద్ధత, నిజాయితీతో పనిచేసే ఉపాధ్యాయునిగా మంచి గుర్తింపు పొందారని కొనియాడారు. విద్యార్థుల సంక్షేమం, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, ఉపాధ్యాయులతో సమన్వయం విషయంలో ఆయన సేవలు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. అనంతరం బూదాల డేవిడ్ మాట్లాడుతూ, తనపై విద్యాశాఖ ఉంచిన నమ్మకానికి అనుగుణంగా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేసేందుకు, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బందితో సమన్వయంగా పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి కుండా వెంకటేశ్వర్లు,యన్. వెంకట్రామయ్య, షేక్ పాదుషా, వి సాంబశివరావు, ఇర్ల కొండయ్య, జి వేమ నారాయణ, ఎస్టీయు రాష్ట్ర బాధ్యులు బి వెంగళరెడ్డి, నాగయ్య, కదిరి వెంకటనరసయ్య లక్ష్మమ్మ ప్లస్ కళాశాల ప్రధానోపాధ్యాయులు బోడా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నా రాంబాబును సత్కరించిన మాజీ ఆర్మీ ఉద్యోగి ఖాసీం



**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 3**

గిద్దలూరు మాజీ శాసనసభ్యులు, మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇంచార్జి అన్నా రాంబాబు జన్మదిన వేడుకలు రెండు రోజుల నుంచి పట్టణంలో ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా మాజీ ఆర్మీ ఉద్యోగి ఖాసీం అన్నా రాంబాబును శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అన్నా రాంబాబు మాట్లాడుతూ దేశసేవ చేసిన సైనికుడి చేతుల మీదుగా సన్మానం అందుకోవడం గర్వకారణమని అన్నా రాంబాబు అన్నారు. ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని, వైఎస్సార్సీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఆశయాలను ప్రతి ఇంటికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. పేదల సంక్షేమే తన ప్రధాన అజెండా అని తెలిపారు. ఆర్మీ ఉద్యోగి ఖాసీం మాట్లాడుతూ... అన్నా రాంబాబు నాయకత్వంలో మార్కాపురం నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని, ఆయన వెంట ప్రజలు నడుస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు అన్నా రాంబాబు ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలని, రాజకీయంగా మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 18వ వార్డు వైసిపి ఇంచార్జి సయ్యద్ గాపూర్, వైసిపి సీనియర్ నాయకులు సిఎం, ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంతర్ జిల్లా విద్యుత్ వైర్ల చోరీ ముఠా అరెస్ట్టి

## ఏడు గురు నిందితులను అరెస్టు చేసిన సంతమాగులూరు పోలీస్ -మూడు కేసుల ఛేదన





**సంతమాగులూరు, పెన్ పవర్, ఆగస్టు 3**

ప్రకాశం, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో విద్యుత్ స్థంభాలకు అమర్చిన అల్యూమినియం, రాగి వైర్లను చోరీ చేస్తూ వరుస నేరాలకు పాల్పడుతున్న అంతర జిల్లాల ముఠాను సంతమాగులూరు పోలీసులు అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు దర్శి ఉపవిభాగ పోలీసు అధికారి బాలమురళీకృష్ణ పర్యవేక్షణలో, సంతమాగులూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి. శేషగిరిరావు ఆధ్వర్యంలో సంతమాగులూరు ఎస్ఐ వి. నాగమల్లేశ్వరరావు , బల్లికురవ ఎస్ఐ వై. నాగరాజు నేతృత్వంలోని పోలీసు బృందాలు ఈ ముఠాను అదుపులోకి తీసుకున్నాయి.

**చోరీ సొత్తు స్వాధీనం**

నిందితుల వద్ద నుంచి ఏడు కిలోల కాల్చిన రాగి వైరు, 150 కిలోల అల్యూమినియం తీగ, ఒక కారు, విద్యుత్ స్థంభాలు ఎక్కడానికి ఉపయోగించే రెండు పరికరాలు, ఒక నిచ్చెన, ఒక కట్టర్, ఒక గోతాం సంచి స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రెండు లక్షలు ఉంటాయని తెలిపారు.

**మూడు కేసుల ఛేదన..:** ఈ అరెస్టుతో సంతమాగులూరు పోలీస్‌స్టేషన్‌లో నమోదైన రెండు కేసులు, నాగులుప్పలపాడు పోలీస్‌స్టేషన్‌లో నమోదైన మరో కేసుతో కలిపి మొత్తం మూడు కేసులను పోలీసులు ఛేదించారు. నిందితులను న్యాయస్థానం ముందు హాజరుపరిచారు.

**విద్యుత్ వ్యవస్థకు తీవ్ర నష్టం**

విద్యుత్ వైర్ల చోరీలు ప్రభుత్వ ఆస్తికి భారీ నష్టం కలిగించడమే కాకుండా గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిస్తాయి. రైతులు, తాగునీటి పథకాలు, గృహ వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుంది.

అంతర జిల్లాల్లో చోరీలకు పాల్పడుతున్న ముఠాను పట్టుకోవడం పోలీసులకు కీలక విజయంగా చెప్పవచ్చు. చోరీ సొత్తును స్వాధీనం చేసుకోవడంతో పాటు మూడు కేసులను ఒకేసారి ఛేదించడం దర్యాప్తులో సమన్వయాన్ని చూపుతోంది. అయితే విద్యుత్ వైర్ల చోరీలను పూర్తిగా అరికట్టాలంటే స్క్రాప్ కొనుగోలు కేంద్రాలపై నిరంతర తనిఖీలు, రాత్రి వేళల్లో విద్యుత్ లైన్ల వద్ద గస్తీని మరింత పెంచాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మూడు కేసులు చేదనపై డిఎస్పి బాలమురళీకృష్ణ, సంతమాగులూరు సర్కిల్ పరిధిలోని పోలీస్ బృందానికి అభినందనలు తెలిపారు.

## నర్సింగ్ విద్యార్థులకు జర్మనీలో కెరీర్ అవకాశాలపై అవగాహన సదస్సు





**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 3**

స్థానిక చైతన్య నర్సింగ్ కళాశాలలో విద్యార్థుల భవిష్యత్తుకు మార్గనిర్దేశం చేసే ఉద్దేశ్యంతో సోమవారం కళాశాలలో జర్మనీ కెరీర్ గైడెన్స్ సెషన్ ఘనంగా నిర్వహించారు. ఈ సదస్సులో జర్మనీలో నర్సింగ్ రంగంలో ఉన్న ఉపాధి అవకాశాలు, విద్యార్హతలు, జర్మన్ భాష అవసరం, వీసా ప్రక్రియ, జీతభత్యాలు, అక్కడి జీవన ప్రమాణాల గురించి నిపుణులు విద్యార్థులకు వివరించారు. జర్మనీలో నర్సులకు ఉన్న డిమాండ్, అక్కడ లభించే గౌరవప్రదమైన జీవితం మరియు కెరీర్ ఎదుగుదల గురించి విద్యార్థులు ఆసక్తిగా తెలుసుకున్నారు. విద్యార్థులు అడిగిన సందేహాలకు నిపుణులు సమాధానమిచ్చారు. విద్యార్థులకు ఇది ఒక అద్భుతమైన అవకాశమని అర్హతలు ఉన్న విద్యార్థులు, నర్సింగ్ గ్రాడ్యుయేట్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో విహెచ్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ వెన్నా హనుమారెడ్డి. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీధర్ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మౌనిక, అధ్యాపకులు, అధ్యాపకేత్రర సిబ్బంది పాల్గొన్నారు.

## గిద్దలూరు -నంద్యాల ఘాట్ రోడ్లో ప్రైవేట్ ట్రావెల్ బస్ , కారు ఢీ ట్రాఫిక్ కు అంతరాయం





**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 03**

గిద్దలూరు సమీపంలో నలమల్ల అటవీ ఘాట్ రోడ్డులో సోమవారం ప్రైవేట్ బస్సు, కారు ఢీకొన్న ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో తృటిలో ప్రాణాపాయం తప్పగా, అదృష్టవశాత్తూ ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. గిద్దలూరు నుంచి నంద్యాల వైపు వెళ్తున్న ప్రైవేట్ బస్సు, నంద్యాల నుంచి గిద్దలూరు వైపు వస్తున్న కారు నల్లమల అటవీ ప్రాంతంలోని ఓ వంతెన మూలమలుపు వద్ద ఒకదానికొకటి ఢీకొన్నాయి. ప్రమాదం కారణంగా దాదాపు గంట పైగా ఇరువైపులా భారీ వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న గిద్దలూరు పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని భారీ క్రేన్ సహాయంతో ప్రమాదానికి గురైన వాహనాలను రోడ్డుపక్కకు తొలగించారు. అనంతరం ట్రాఫిక్‌ను నియంత్రించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

# తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం.

**పొన్నలూరు పెన్ పవర్ ఆగస్టు 3**

మండలంలోని కొత్త సింగరభట్ల పాలెం, చెన్నుపాడు రెడ్డిపాలెం గ్రామాల్లో సోమవారం ఐసిడిఎస్ సూపర్వైజర్ రిజ్వాన ఆధ్వర్యంలో తల్లిపాలు వారోత్సవం నిర్వహించారు. రిజ్వానా మాట్లాడుతూ పుట్టిన వెంటనే తల్లిపాలు తాపడం బిడ్డకు శ్రేష్కరమని అన్నారు. తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారంతోపాటు రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయన్నారు. ప్రసవం జరిగిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు తాగిస్తే రోగనిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారి జి సింధు, హెల్త్ సూపర్వైజర్ జి సుజాత, అంగన్వాడి కార్యకర్తలు పోలమ్మ, కే రామలక్ష్మి, పి సునీత, టి పద్మావతి, జి గోవర్ధనమ్మ, ఏ పద్మ, అరుణ, అమృత, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.






# ప్రజల సమస్యలు గాలికొదిలేసి... నిధుల దోపిడీ చేశారు..

## వైస్ ఎంపీపీ లింగంగుంట్ల రాములు

**పుల్లలచెరువు, పెన్ పవర్ ఆగస్ట్ 3**

పుల్లలచెరువు మండల కేంద్రంలోని అంజనపురంలో నెలకొన్న తీవ్రమైన తాగునీటి సమస్యపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ పుల్లలచెరువు వైస్ ఎంపీపీ లింగంగుంట్ల రాములు సోమవారం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. అంజనాపురం కాలనీ వాసులు ఎన్నో రోజులుగా తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆయన మండిపడ్డారు. తక్షణమే తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా చర్యలు చేపట్టి డీప్ బోరు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ మండలంలో అభివృద్ధి పూర్తిగా స్తంభించిపోయిందని, ప్రజా సమస్యలను గాలికొదిలేసి అధికార యంత్రాంగం, కూటమి నాయకులకు వారికి నచ్చిన విధంగా వ్యవహరిస్తున్నారని తీవ్ర స్థాయిలో ఆరోపించారు. మండలానికి ప్రభుత్వం విడుదల చేసిన నిధులు ప్రజల అవసరాలకు వినియోగించకుండా కూటమి నాయకులే తమకు అనుకూలంగా మళ్లించుకున్నారని విమర్శించారు. గ్రామాల్లో చిన్నచిన్న అభివృద్ధి పనులు కూడా చేపట్టకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి వంటి కనీస వసతులు లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతుంటే పాలకులు మాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల కష్టాలను పరిష్కరించాల్సిన వారు తమ బాధ్యతలను విస్మరించి, అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. మండలంలోని డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందని, ఎక్కడ చూసినా మురుగు నీరు నిల్వ ఉండటంతో ప్రజలు దుర్వాసన, దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.



అయినప్పటికీ సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకుండా కూటమి నాయకుల ప్రయోజనాలకే అధికారులు పని చేస్తున్నారని విమర్శించారు. ప్రజల కోసం కేటాయించిన నిధులు ప్రజలకే ఖర్చు కావాలే తప్ప కొందరి స్వార్థ ప్రయోజనాలకు వినియోగించకూడదని హితవు పలికారు. అభివృద్ధి పనుల విషయంలో మండలంలో "ఎక్కడ వేసిన గొంగళి అక్కడే" అన్న చందంగా పరిస్థితి ఉందని, ఏ గ్రామంలో చూసినా సమస్యలే కనిపిస్తున్నాయని అన్నారు. ప్రజలకు సేవ చేయాల్సిన అధికారులు రాజకీయాలకు అతీతంగా పనిచేయాల్సి ఉండగా, కూటమి కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారంటూ తీవ్ర విమర్శలు చేశారు. అధికారులు ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించి, అభివృద్ధి పనులపై దృష్టి సారించకపోతే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## టెట్ కు హాజరయ్యే ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ఓడి సౌకర్యం కల్పించాలి

### ఎస్టీయు రాష్ట్ర ఉపాధ్యక్షులు కే ఎర్రయ్య



**అర్ధవీడు, పెన్ పవర్, ఆగష్టు 3**

ఈ నెల 5వ తేదీ నుండి ప్రారంభమయ్యే టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్)కు హాజరయ్యే ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రభుత్వం ప్రత్యేక ఓడి (ఆన్ డ్యూటీ) సౌకర్యాన్ని కల్పించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు కే ఎర్రయ్య ప్రభుత్వాన్ని కోరారు. అర్ధవీడు మండల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు మరియు సి. నాగులవరం, కాకర్ల, మాగుటూరు, పోతురాజుటూరు, రంగాపురం, గన్నెపల్లె, వెలగలపాయ, బొమ్మిలింగం గ్రామాలలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా




ఆయన మాట్లాడుతూ, ఉద్యోగ ఉపాధ్యాయులకు ప్రభుత్వం బకాయిలో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని, 30 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీని ప్రకటించాలని, ఏకీకృత సర్వీస్ రూల్స్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే అర్ధవీడు మండలంలో అన్యాయంగా సస్పెన్షన్‌కు గురైన ఎంఈఓలను వెంటనే విధుల్లోకి పునరుద్ధరిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు టి.కె.ఎస్. ప్రసాద్, జిల్లా కార్యదర్శి డి. నబీ ఖాన్, మండల శాఖ అధ్యక్షుడు సి. హెచ్. వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఎం. మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఎలినినో పై అవగాహన యాత్ర







**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 3**

కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎల్ నినో పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సూచనలమేరకు ఎల్ నినో కంబ్యాట్ టీం లో భాగంగా కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల విద్యార్థులు పామూరు మండలంలోని దుబగుంట, నుచ్చుపోద, ఇనిమెర్ల,, బోట్లగూడూరు, చింతలపాలెం,కట్టకిందపల్లి, బలిజపాలెం, ఖంభాలదిన్నె, మోపాడు గ్రామాలను సందర్శించి రైతులకు వర్షభావ నీటి ఏద్దడి కారణంగా పండించవలసిన పంటలు మరియు సాగుబడి విధానాల మీద అవగాహనా పెంపోందించుటకు సూచనలు చెశారు. ఈ కార్యక్రమం లొ రైతులు, విద్యార్థులు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

## గిద్దలూరు పురపాలక సంఘం పరిధిలో 15 ఆర్థిక సంఘం ,ఎస్సీ ఎస్పీ , నిధులు రూ.1.62 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి





**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 03**

గిద్దలూరు పురపాలక సంఘం పరిధిలోని పి.ఆర్ కాలనీలో 14 లక్షల నిధులతో సిమెంట్ రోడ్లు,చెర్రెడ్డి పల్లెలో 17.80 లక్షల నిధులతో డ్రెయిన్లు,మార్కెట్ యార్డు ఏరియాలో 83.67 లక్షల నిధులతో సిమెంట్ రోడ్లు,పాముల పల్లెలో 11 లక్షల నిధులతో డ్రెయిన్లు,నల్లబండ బజార్ లో 24 లక్షల నిధులతో సిమెంట్ రోడ్లు,నంద్యాల రోడ్ లో 12 లక్షల నిధులతో సిమెంట్ రోడ్లు,మొత్తం 1.62 కోట్ల రూపాయలతో శాసన సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి చే శంకుస్థాపన చేయబడిన పనులు మొత్తం పూర్తి అయ్యాయని మున్సిపల్ కమిషనర్ ఈ వి రమణ బాబు తెలిపారు . శాసన సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి సహకారంతో మున్ముందు మరిన్ని నిధులతో గిద్దలూరు పురపాలక సంఘం ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని కమీషనర్ రమణ బాబు తెలిపారు.

# పేకాట శిబిరంపై దాడి

**పొన్నలూరు పెన్ పవర్ ఆగస్టు 3**

మండలంలోని పెద్ద వెంకన్నపాలెం గ్రామంలో సోమవారం పేకాట శిబిరంపై ఎస్సై సత్యనారాయణ తన సిబ్బందితో దాడి చేశారు. వివరాల ప్రకారం స్థానికులు సమాచారం ఇవ్వడంతో ఎస్సీ కాలనీలో పేకాట ఆడుతున్న సమాచారం తెలుసుకొని నలుగురు వ్యక్తులను అదుపులో తీసుకొని వారి వద్ద నుంచి రూ 2450 నగదు, నాలుగు ఫోన్లు స్వాధీనపరుచుకున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినట్లయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



# అభివృద్ధి.. సంక్షేమం.. దేశభక్తి ప్రతిబింబించేలా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

## - అధికారులకు దిశా నిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్ రాజాబాబు

## - భద్రతా ఏర్పాట్లను వివరించిన జిల్లా ఎస్పీ హర్ష వర్ధన్ రాజు

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 03**

ఆగస్ట్- 15 నాడు స్థానిక పోలీస్ పేరెడ్ గ్రౌండ్లో నిర్వహించే 80 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా దేశభక్తిని ఇనుమడింప చేసే విధంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ పి. రాజబాబు ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ వి . హర్షవర్ధన్ రాజు తో కలిసి జిల్లా కలెక్టర్ పి రాజబాబు జిల్లా అధికారులతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సంస్కృతి సంప్రదాయాలను ఉట్టిపడేలా కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన అధికారులకు సూచించారు. ప్రభుత్వం నిర్వహించే పలు అభివృద్ధి సంక్షేమ పథకాలు పై ప్రచారం కల్పించేలా స్టాల్స్ ను ఏర్పాటు చేయడంతో పాటు సంబంధిత ప్రాథమిక రంగాల శాఖ అధికారులు వివిధ శాఖల అధికారులు తమ శాఖలో చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలపై శకటాలను ప్రదర్శించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించేందుకు అధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జిల్లా రెవెన్యూ



అధికారికి సూచించారు. స్కూల్ పిల్లల చేత దేశభక్తి, సామరస్యత, మత సౌభ్రాతృత్వం వంటిని ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు. సంబంధిత పోలీసు శాఖ వారు అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు పోలీస్ బ్యాండ్ ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు.



ఈ సందర్భంగా వివిధ శాఖలు తీసుకోవలసిన చర్యలపై ఆయన విపులంగా చర్చించారు. డయాస్ ఏర్పాటు, విఐపి గ్యాలరీ తదితరాలను పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు సూచిస్తూ ప్రోటోకాల్ నియమ నిబంధనలను తప్పక పాటించి ముందస్తుగానే అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ స్వాతంత్ర వేడుకలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు డయాస్ చుట్టూ అనవసరమైన రాకపోకలను నిషేధించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. దేశభక్తిని చాటి చెప్పే విధంగా పోలీస్ బ్యాండు, కవాతులను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, కందుకూరు సబ్ కలెక్టర్ హిమవంశీ, డివిజనల్ అధికారులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తల్లి పాలు శిశువుకు తొలి రక్షణ కవచం...





**పుల్లల చెరువు పెన్ పవర్ ఆగస్ట్ 3**

ప్రపంచ తల్లి పాల వారోత్సవాల సందర్భంగా పుల్లల చెరువు మండలం ముటుకుల గ్రామంలోనీ అంగన్వాడి 1,3 కేంద్రాల్లో సోమవారం అవగాహన కార్యక్రమాన్ని అంగన్వాడి కార్యకర్త సుజాత,మల్లీశ్వరి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అంగన్వాడి కార్యకర్తలు మాట్లాడుతూ నవజాత శిశువుకు తల్లి పాలు ప్రకృతి ప్రసాదించిన అమూల్యమైన వరమని అన్నారు. పుట్టిన గంటలోపే శిశువుకు తల్లి పాలు పట్టించడం ద్వారా అనేక ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని తెలిపారు.తొలి ఆరు నెలల వరకు శిశువుకు తల్లి పాలు మాత్రమే అందించాలని, నీరు లేదా ఇతర ఆహార పదార్థాలు ఇవ్వకూడదని సూచించారు.తల్లి పాలలో శిశువు ఎదుగుదలకు అవసరమైన అన్ని పోషకాలు సమృద్ధిగా ఉంటాయని, రోగనిరోధక శక్తి పెంపొందించడంలో తల్లి పాలు కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు.తల్లి పాల వల్ల శిశువుకు మాత్రమే కాకుండా తల్లికి కూడా అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని, ప్రతి తల్లి ఈ విషయంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కోరారు.అంగన్వాడీ కార్యకర్తలు తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తూ పలు సూచనలు చేశారు. గర్భిణీలు, బాలింతల సందేహాలను నివృత్తి చేసి, శిశు ఆరోగ్య పరిరక్షణలో తల్లి పాల పాత్రను వివరించారు. అనంతరం తల్లి పాల వారోత్సవాల సందర్భంగా అవగాహన ప్రతిజ్ఞ చేయించి, గ్రామ ప్రజలకు ఆరోగ్య సూచనలు అందించారు.ఈ కార్యక్రమంలో ఆయాలు, తల్లులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ప్రతిభకు వేదికగా అక్షర కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు





**సి.ఎస్.పురం, పెన్ పవర్ ఆగస్టు 3**

పువ్వాడి ఫంక్షన్ హాల్ నందు అక్షర జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ కదిరి బాబురంగారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నూతనంగా కళాశాలలో చేరిన విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు ఆత్మీయ స్వాగతం పలకగా, ఆహ్లాదకర వాతావరణంలో కార్యక్రమం కొనసాగింది.ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. దేశభక్తి, సాంప్రదాయం, సామాజిక చైతన్యాన్ని ప్రతిబింబించే నృత్యాలు, గేయాలు, వినోదాత్మక ప్రదర్శనలు సభికుల ప్రశంసలు అందుకున్నాయి. ప్రతి ప్రదర్శనకు తల్లిదండ్రులు చప్పట్లతో అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ కదిరి బాబురంగారావు మాట్లాడుతూ, కేవలం 90 మంది విద్యార్థులతో ప్రారంభమైన అక్షర కళాశాల నేడు అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతూ విద్యార్థుల తల్లిదండ్రుల విశ్వాసాన్ని సంపాదించుకుందని అన్నారు. నాణ్యమైన విద్య, క్రమశిక్షణ, ఉత్తమ ఫలితాలే కళాశాల అభివృద్ధికి మూల సూత్రాలని పేర్కొన్నారు. విద్యార్థుల చదువు కొరకు కళాశాల అధ్యాపకులతో పాటు తల్లిదండ్రులు కూడా సహకరించాలని కోరారు కళాశాలలో విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి కళాశాల అధ్యాపకులు లక్ష్యాలను నిర్దేశించుకుని కృషి చేస్తున్నారని అన్నారు అక్షర కళాశాల అభివృద్ధికి కృషి చేసిన అధ్యాపకులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

# తాటిచర్ల గ్రామంలో పండ్ల తోటల్లో వీడ్ మ్యాట్ ప్రాముఖ్యతపై ప్రదర్శన క్షేత్రం నిర్వహణ

## పండ్ల తోట రైతులకు విడ్ మ్యాట్ పై అవగాహన కల్పించిన ఆత్మ పి వాణి, గిద్దలూరు ఉద్యాన శాఖాధికారిణి శ్వేత.





**కొమరోలు పెన్ పవర్ ఆగస్టు 3**

కొమరోలు మండలం, తాటిచర్ల గ్రామంలో సోమవారం ఆత్మ ఆధ్వర్యంలో పండ్ల తోటల్లో వీడ్ మ్యాట్ వినియోగంపై ప్రదర్శన క్షేత్రం నిర్వహించారు.ఆ కార్యక్రమంలో ఆత్మ పి వాణి గిద్దలూరు ఉద్యాన శాఖ అధికారిని శ్వేత పాల్గొని ప్రస్తుతం విస్తృతంగా ఉపయోగిస్తున్న ప్లాస్టిక్ మల్చింగ్ షీట్ మరియు వీడ్ మ్యాట్ మధ్య ఉన్న తేడాలను రైతులకు వివరించి, పండ్ల తోటల్లో వీడ్ మ్యాట్ వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఆ సందర్భంగా వారు మాట్లాడుతూ వీడ్ మ్యాట్ ద్వారా కలుపు మొక్కల పెరుగుదలను సమర్థవంతంగా అరికట్టవచ్చని, ప్లాస్టిక్ మల్చింగ్‌తో పోలిస్తే వీడ్ మ్యాట్ ఎక్కువ కాలం మన్నికగా ఉంటుందని వివరించారు. నేలలో తేమను ఎక్కువ కాలం నిల్వ ఉంచి నీటి వినియోగాన్ని తగ్గిస్తుందని, ప్లాస్టిక్ మల్చింగ్ షీట్‌తో పోలిస్తే వీడ్ మ్యాట్ నేల ఉష్ణోగ్రతను సమతుల్యంగా ఉంచి, అధిక వేడి పెరగకుండా సహాయపడుతుందని, దీంతో మొక్కల వేర్లు ఆరోగ్యంగా పెరిగి మంచి ఎదుగుదల సాధిస్తాయని పేర్కొన్నారు.పండ్ల నాణ్యతను మెరుగుపరచడంతో పాటు తోట నిర్వహణ ఖర్చులను తగ్గిస్తుందని, దీర్ఘకాలంలో రైతులకు ఆర్థికంగా లాభదాయకంగా ఉంటుందని, తోటలను పరిశుభ్రంగా ఉంచి పంట నిర్వహణను సులభతరం చేస్తుందని అన్నారు. వీడ్ మ్యాట్ వినియోగం ద్వారా కలుపు నివారణ కోసం కూలీల అవసరం తగ్గి, సాగు వ్యయం తగ్గుతుందని వివరించారు.ఆ సందర్భంగా అధికారులు రైతుల సందేహాలను నివృత్తి చేసి, పండ్ల తోటల్లో వీడ్ మ్యాట్ వినియోగాన్ని ప్రోత్సహించారు. రైతులు కూడా ఈ సాంకేతికతపై ఆసక్తి వ్యక్తం చేస్తూ తమ తోటల్లో అమలు చేసేందుకు ముందుకు వచ్చారు. ఈ కార్యక్రమం లో ఆత్మ పీ. వాణి,ఉద్యానవనశాఖాధికారిని శ్వేత రైతులు పాల్గొన్నారు.

# ప్రజల మనిషి, పోరాట యోధునికి సెలవు

## వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకులు మాండ్ల వెంకటేశ్వర్లు





**పెద్ద దోర్నాల పెన్ పవర్ ఆగస్టు 3**

మండల కేంద్రంలోనిమండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాండ్ల వెంకటేశ్వర్లు ఆదివారం ఉదయం సమయంలో గుండెపోటు రావడం వలన తనువు చాలించడం జరిగింది. మాండ్ల వెంకటేశ్వర్లు మరణ వార్త విని ఆంధ్ర , తెలంగాణ రాష్ట్రము లోని అనేక ప్రాంతాల నుంచి ఆత్మీయులు, శ్రేయోభిలాషులు మరియు మాండ్ల వెంకటేశ్వర్లు అభిమానించే ప్రజలు సుందరయ్య కాలనీకి మాండ్ల వెంకటేశ్వర్లు యొక్క పార్థివదేహమును చూచుట కొరకు రావడం జరిగింది. ఈ సందర్భంగా మండలంలోని ఆత్మీయులు, ఆయా పార్టీల నాయకులు మరియు సుందరయ్య కాలనీలోని ప్రజలందరూ మాండ్ల వెంకటేశ్వర్లు గత 30 సంవత్సరాల నుంచి సుందరయ్య కాలనీలో ఉన్న అనేక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి సమస్యలను పరిష్కరించిన వ్యక్తిగా మరియు ప్రజలందరితో ప్రేమ, ఐక్యతతో కలిసి మెలిసి తిరిగినటువంటి మంచి మనిషిగా ప్రజలందరి మనిషిగా జ్ఞాపకము తెచ్చుకొని కన్నీరు కార్చడం జరిగింది. మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ శ్రీ గంటా వెంకట రమణారెడ్డి యర్రగొండపాలెం నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యులు శ్రీ తాటిపర్తి చంద్రశేఖర్ వ్యక్తిగత సహాయకుడు కోటి మరియు మండలంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అన్ని విభాగాల ముఖ్య నేతలు మాండ్ల వెంకటేశ్వర్లు పార్థివ దేహమును దర్శించి పూలమాలలు వేసి కుటుంబాన్ని ధైర్యపరచడం జరిగింది. మాండ్ల వెంకటేశ్వర్లు వైయస్సార్సీపి పార్టీకి ఎంతో నమ్మకమైనటువంటి కార్యకర్తగా మరియు మండల నాయకునిగా తన విధులు సక్రమంగా నిర్వహించారని తెలియజేస్తూ కుటుంబమును అన్ని విధాలుగా రానున్న దినాల్లో ఆదుకుంటామని భరోసా ఇవ్వడం జరిగింది.కీర్తిశేషులు మాండ్ల వెంకటేశ్వర్లు పార్థివదేహమును ఉమ్మడి ప్రకాశం జిల్లా ఏపీపీఎఫ్ జనరల్ సెక్రెటరీ పాస్టర్ బి. యన్ అగస్టిన్ , మండల పాస్టర్స్ మరియు ఇవాంజిలిస్ట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పాస్టర్ బుట్టి పాల్ స్పర్జన్ మరియు ఆర్.సి.యం ఫాదర్ రెవరెండ్ అమృత రావు కలిసి భూస్థాపన కార్యక్రమం చేయడం జరిగింది. కీర్తిశేషులు మాండ్ల వెంకటేశ్వర్ల అంతిమ యాత్ర లో అల్లుండ్లు మరియు రక్తసంబంధీకులు శ్రేయోభిలాషులు మండల పాస్టర్ అసోసియేషన్ లోని కమిటీ పెద్దలు, ఆర్.సి.ఎం చర్చ్ సంఘ పెద్దలు, క్రైస్ట్ చర్చ్ సంఘ పెద్దలు, సుందరయ్య కాలనీ లోని చర్చ్ ఆఫ్ ప్రేయర్ సంఘ విశ్వాసులు, సుందరయ్య కాలనీ పెద్దలు మరియు వందలాదిగా ప్రజలందరూ అంతిమయాత్రలో పాల్గొనడం జరిగింది.

# కరేడు నేతలతో ఎమ్మెల్యే ఇంటూరి సమావేశం



**కందుకూరు పెన్ పవర్, ఆగస్టు 3**

ఉలవపాడు మండలం కరేడు పంచాయితీలోని తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులతో శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు సోమవారం పార్టీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి సంక్షేమంపై ఇంటింటి ప్రచారం, ఓటర్ల జాబితా సవరణలు, పెద్ద పంచాయతీ అయిన కరేడులో ఇప్పటివరకు చేసిన అభివృద్ధి, పెండింగ్ సమస్యలు, వాటి పరిష్కారం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. నాయకులందరూ ఐక్యమత్యంతో, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో క్లస్టర్ ఇంచార్జి పోలుబోయిన శ్రీనివాసులు, పార్టీ నేతలు చెంచురామిరెడ్డి, మెట్టా శ్రీనివాసరెడ్డి, యూనిట్ ఇన్చార్జులు కోటంగారి బాలమురళి, తేజ, రాచగర్ల శివ, పంచాయతీలోని అన్ని గ్రామాల నాయకులు, బిఎల్ఏలు పాల్గొన్నారు.

# పొదిలి మునిసిపల్ కమిషనర్‌ను కలసిన మస్తాన్ వలి



**పొదిలి, పెన్ పవర్, ఆగస్టు 3**

పొదిలి మునిసిపల్ కమిషనర్ రామ్మోహనరావును పొదిలి పెద్ద చెరువు పాలకవర్గ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి కలిశారు. మునిసిపల్ కమిషనర్ గా రామ్మోహనరావు ఇటీవలనే బదిలీపై వచ్చి తన ఉద్యోగ బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భాన్ని పునస్కరించుకొని మస్తాన్ వలి సోమవారం నాడు కమిషనర్ ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అలాగే పెద్ద చెరువు నిర్వహణ గురించి పలు విషయాలను మస్తాన్ వలి కమిషనర్ దృష్టికి తీసుకుని వెళ్లారు.

# నారాయణస్వామికి ఆదాయం రూ. 1,36,788/- లు

**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 3**

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానం ఆదివారం ఆదాయం రూ.1,36,788/- లు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిక్కెట్లు అమ్మకం ద్వారా జమ రూ. 69,980/- లు, లడ్డు ప్రసాదం అమ్మకం ద్వారా రూ.37, 960/- లు, శాశ్వత అన్నదాన పథకం నకు ద్వారా విరాళములు రూ,18,332/-లు, స్వామివారి పంచామృత అభిషేకమునకు రూ .5,516/- లు, మహా ప్రాకార నిర్మాణమునకు రూ.5,000/- లు వచ్చినట్లు తెలిపారు.

# పొదిలి బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా రమణ కిషోర్



**పొదిలి, పెన్ పవర్, ఆగస్టు 3**

పొదిలి బాగా అసోసియేషన్ అధ్యక్షులుగా ఎంవి రమణ కిషోర్ ఎన్నికయ్యారు. సోమవారం నాడు పొదిలిలో బార్ అసోసియేషన్ సమావేశం జరిగింది. సమావేశానికి న్యాయవాదుల సంఘం అధ్యక్షులు రమణ కిషోర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బార అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎంవి రమణ కిషోర్, ఉపాధ్యక్షులుగా పి . జ్ఞాన కుమారి, గాదే సుజాత, కార్యదర్శిగా గాలి ముట్టి పెద్దయ్య, సహాయ కార్యదర్శిగా ఉప్పు శ్రీహర్ష చక్రవర్తి, మహిళా ప్రతినిధిగా ఐ. గౌతమి, కోశాధికారిగా ముల్లా నాయబ్ రసూల్, కల్చరల్ కార్యదర్శిగా డివి మహేష్ బాబు ను ఎన్నుకున్నారు. అలాగే బార్ సభ్యులుగా కె. షకీలా, ఎం మోజస్ లను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు శ్రీపతి శ్రీనివాసరావు, గుద్దేటి సుబ్బారావు, టి రామమోహనరావు, ఎస్. ఎం. భాష, బాల బ్రహ్మం, జి శ్రీనివాసులు, డి రామారావు, ఏ జి పి షేక్. షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

# కందుకూరులో తక్కువ ధరకు నాణ్యమైన బియ్యం విక్రయాల ప్రారంభం

**--రైతుబజార్‌లో ప్రత్యేక రైస్ అవుట్‌లెట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే ఇంటూరి**





**కందుకూరు, పెన్ పవర్ ఆగస్టు 3 :**

పేదలపై ఆర్థిక భారాన్ని తగ్గించడం, బియ్యం ధరలను నియంత్రించడం, నాణ్యమైన ఆహార ధాన్యాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచడం, బ్లాక్ మార్కెట్‌కు అడ్డుకట్ట వేయడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ప్రత్యేక రైస్ అవుట్‌లెట్ కార్యక్రమానికి కందుకూరులో శ్రీకారం చుట్టారు. సోమవారం కందుకూరు రైతుబజార్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక రైస్ అవుట్‌లెట్‌ను స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించి బియ్యం విక్రయాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు వినియోగదారులకు స్వయంగా బియ్యం సంచులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 115 రైతుబజార్లు, 500 రైస్ మిల్లుల వద్ద ప్రత్యేక కౌంటర్ల ద్వారా తక్కువ ధరకు నాణ్యమైన బియ్యాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. కందుకూరు పట్టణ రైతుబజార్‌తో పాటు ఓగూరు సమీపంలోని విష్ణు సాయి రైస్ ట్రేడర్స్ రైస్ మిల్లు వద్ద కూడా మరో విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. బహిరంగ మార్కెట్లో స్టీమ్డ్ బియ్యం కిలో రూ.62 ఉండగా, ప్రభుత్వం ద్వారా రూ.52కే అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే బిపిటి బియ్యాన్ని మార్కెట్ ధర రూ.58కు బదులుగా రూ.50కే విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన కుటుంబాలు ఆధార్ కార్డు చూపించి ఒక్కో కార్డుపై 10 కిలోల బియ్యాన్ని కొనుగోలు చేసుకోవచ్చని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరూ వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రాయపాటి సుభాషిణి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, తహసీల్దార్ మురళి, ఏఎంసీ సెక్రటరీ రామాంజనేయులు, ఎస్టేట్ ఆఫీసర్ స్వరూపారాణి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాదాల వెంకటేశ్వర్లు, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, రాష్ట్ర కమిటీ నాయకులు షేక్ రఫీ, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు అల్లం వెంకటేశ్వర్లు, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ సలాం, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ రూబీ, క్లస్టర్ ఇన్‌చార్జి వడ్డెళ్ళ రవిచంద్ర, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ముచ్చు శ్రీను, పార్టీ నాయకులు రాయపాటి శ్రీను, పలువురు వార్డు అధ్యక్షులు, పచ్చవ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# బీజెపి కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

**రాష్ట్ర బీజెపి మహిళా మోర్చా కార్యదర్శి విజయలక్ష్మి**



**పొదిలి, పెన్ పవర్, ఆగస్టు 3**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు బిజెపి నాయకులు, కార్యకర్తలు, సిద్ధంగా ఉండాలని ఆ పార్టీ రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శి బెల్లంకొండ విజయలక్ష్మి కోరారు. సోమవారం నాడు స్థానిక బిజెపి మండల కార్యాలయంలో బిజెపి మండల సమావేశం జరిగింది. సమావేశానికి మండల బిజెపి అధ్యక్షులు డి రమణ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన విజయలక్ష్మి మాట్లాడుతూ త్వరలో రానున్న స్థానిక సంస్థలకు బిజెపి నాయకులు, కార్యకర్తలు అన్ని విధాల సిద్ధంగా ఉండాలని ఆమె సూచించారు. అలాగే ఆగస్టు 15వ తేదీ జరగనున్న ఘర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఎన్ నాగేశ్వరరావు,, సయ్యద్ ఖాదర్ భాష, డి నరసింహారావు, కిరణ్, వెంకటేశ్వర్లు, మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వానికి రెండు కళ్ళు

**-అభివృద్ధి పనులు, సంక్షేమ వ్యయాల వివరాలతో కరపత్రాల పంపిణీ**

**-ఎమ్మెల్యే ఇంటూరి కృషితో కందుకూరులో వేగవంతమైన అభివృద్ధి**

**జిల్లా టిడిపి నేత సోమినేని రవీంద్ర**




**కందుకూరు పెన్ పవర్, ఆగస్టు 3**

ఒకవైపు అభివృద్ధి మరోవైపు సంక్షేమం కూటమి ప్రభుత్వానికి రెండు కళ్ళు అని జిల్లా టిడిపి నేత సోమినేని రవీంద్ర అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న "రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమంలో భాగంగా సోమవారం వలేటివారిపాలెం మండలంలోని జెడ్ ఉప్పలపాడు గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకులు విస్తృత ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు వివరించారు. చేపట్టిన అభివృద్ధి పనులు, వివిధ సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వం చేసిన వ్యయాన్ని అంకెలతో సహా వివరిస్తూ ప్రత్యేక కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సోమినేని రవీంద్ర మాట్లాడుతూ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కృషితో కందుకూరు నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల కల్పన, రహదారులు, తాగునీరు, డ్రైనేజీ, ఇతర అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం దశలవారీగా అమలు చేస్తూ అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయం చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజలతో మమేకమైన నాయకులు ప్రభుత్వ పనితీరు, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ, ప్రజా సమస్యలను కూడా అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర అభివృద్ధి భవిష్యత్తు చంద్రబాబు నాయుడు తోనే సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మంచి చేస్తున్నాం... మద్దతివ్వండి

**-ఎమ్మెల్యే ఇంటూరి -కూటమి ప్రభుత్వంలో ప్రజా సమస్యలకు చెక్**

**-పెదపవనిలో ఇంటింటి ప్రచారం చేసిన నాగేశ్వరరావు**

**-సంక్షేమ పథకాలపై సంతృప్తి వ్యక్తం చేసిన మహిళలు**




**కందుకూరు పెన్ పవర్, ఆగస్టు 3**

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలన కొనసాగిస్తుంది. సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నాం. ప్రజల్లో సంతృప్తి స్థాయిని పెంచడమే మా లక్ష్యం అని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. రెండేళ్ల హయాంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాన్ని లింగసముద్రం మండలం పెదపవని గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే చేపట్టారు. ఎస్టి కాలనీలో ఇంటింటికి వెళ్లి, కరపత్రాల రూపంలో వాస్తవాలను వివరించారు. ఈ రెండేళ్లలో గ్రామంలో సుమారు 80 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులు చేయడంతో పాటు వివిధ సంక్షేమ పథకాల ద్వారా 60 కోట్ల రూపాయలు ప్రజలకు చేర్చామని ఎమ్మెల్యే చెప్పారు. ముఖ్యమంత్రి సహాయ నిధి మరియు ఎల్ వో సి ద్వారా 19 మందికి 8.85 లక్షలు మంజూరు చేయించి ఆరోగ్య భరోసా కల్పించామని తెలియజేశారు. అలాగే రైతులకు మేలు జరిగేలా, 10 లక్షలతో పెదపవని చెరువును అభివృద్ధి చేసినట్లు వెల్లడించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలన్నీ 90 శాతం అమలు చేశామని, అర్హులైన ముస్లిం ఎస్సీ ఎస్టీ కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామని నాగేశ్వరరావు తెలిపారు. మంచి చేస్తున్న కూటమి ప్రభుత్వానికి అందరూ మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. మరోవైపు తమకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయని, గత జగన్ పాలనకు భిన్నంగా గ్రామాల్లో అభివృద్ధి వేగవంతంగా జరుగుతోందని మహిళలు ఎమ్మెల్యేతో అన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు పూరిమిట్ల గురునాథం, గ్రామ పార్టీ అధ్యక్షుడు గొర్రెపాటి సాంబయ్య, నియోజకవర్గ ముస్లిం మైనారిటీ నాయకుడు షేక్ నాయబ్ రసూల్, పార్టీ నాయకులు షేక్ రఫీ, డాక్టర్ నరసింహారావు, క్లస్టర్ ఇంచార్జ్ వంకాయలపాటి మాల్యాద్రి, పలు గ్రామాల అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# మణికేశ్వరంలో 'రెండేళ్ల నమ్మకం' ప్రచారం

**గడపగడపకూ వెళ్లి సంక్షేమ పథకాలపై అవగాహన.**



**అద్దంకి, ఆర్.సి(పెన్ పవర్) ఆగస్టు 03**

అద్దంకి మండలం, మణికేశ్వరం గ్రామంలోని ఎస్సీ మాల కాలనీలో గ్రామ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ప్రచార కార్యక్రమం ముమ్మరంగా సాగింది. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో సాధించిన ప్రగతి, అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరిస్తూ 'రెండేళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమం ఇంటింటా' కార్యక్రమాన్ని రెండో రోజు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను ఆత్మీయంగా పలకరించారు. స్థానికుల సమస్యలు, ఇతర అవసరాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కారమయ్యేలా చూస్తామని వారికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, స్థానిక నాయకులు ఆదినారాయణ, బలరామిరెడ్డి, మాథ్యూస్, శివ, శ్రీను, ముస్తఫా, ఏలియ్య తదితరులు పాల్గొన్నారు.

# బయ్యర్లపై చర్యలకు పొగాకు బోర్డు అధికారులు హామీ




**పొన్నలూరు పెన్ పవర్ ఆగస్టు 3**

కందుకూరు పొగాకు బోర్డు వేలం కేంద్రం నెం.26లో బయ్యర్ల వ్యవహారశైలికి నిరసనగా రైతులు ఆందోళనకార్యక్రమం నిర్వహించడం జరిగింది. అనంతరం ఆమ్ ఆద్మీ పార్టీ కందుకూరు నియోజకవర్గ నాయకుడు నేతి మహేశ్వరరావు ప్రారంభించిన నిరాహార దీక్షతో పొగాకు బోర్డు అధికారులు కందుకూరుకు చేరుకుని రైతులతో చర్చలు జరిపి, సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు రైతులను అవమానించిన బయ్యర్లపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో నేతి మహేశ్వరరావు తన నిరాహార దీక్షను విరమించారు. సమావేశంలో రైతులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. బోర్డు అనుమతులతో సాగు చేసిన పొగాకును ప్రభుత్వం కనీసం రూ.30 వేల ధరకు కొనుగోలు చేయాలని కోరారు. గిట్టుబాటు ధర లేని పరిస్థితుల్లో క్రాప్ హాలిడే ప్రకటించి, ఈ ఏడాది పండిన మొత్తం పొగాకును ప్రభుత్వమే కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. వేలం ప్రారంభంలో అధిక ధరలు చూపించి చివరకు తక్కువ ధరలకు కొనుగోలు చేయడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, నాణ్యత ఆధారంగా పారదర్శకంగా ధరలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. కొంతమంది బయ్యర్లు రైతులతో అవమానకరంగా ప్రవర్తిస్తున్నారని, సిండికేట్‌గా వ్యవహరిస్తూ ధరలను ప్రభావితం చేస్తున్నారని ఆరోపించారు. కొనుగోలు వివరాలను బోర్డు పారదర్శకంగా ప్రకటించాలని, రైతుల సంతకం లేకుండా సీఆర్ నమోదు చేయరాదని, సూపరింటెండెంట్ పర్యవేక్షణలోనే కొనుగోళ్లు నిర్వహించాలని కోరారు. చిన్న రైతుల సమస్యల పట్ల అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆద్మీ నియోజవర్గ నాయకులు నేతి మహేశ్వరరావు, పాలడుగు సింగయ్య, తాళ్లపనేని మాధవ, రాజమోహన్ రెడ్డి, చెడిపోతు మాలకొండయ్య, పొగాకు రైతులు మండవ ప్రసాద్, పల్లపోతు సురేంద్ర, కాటా మల్లికార్జునరావు, జి రమణారెడ్డి, రాఘవరెడ్డి, కుంకు సురేస్ , కంచర్ల రామ్ కుమార్, వెంకట్రావు, కల్లూరి చెంచురామయ్య, జె ఆదయ్య నేలపాటి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడ జిల్లా ను ఆదర్శంగా నిలపాలి

**జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్....**

**కాకినాడ పెన్ పవర్ ఆగస్టు 3**

కలెక్టరేట్ లోని వివేకానంద హాలులో జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమము జిల్లాకలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్,జిల్లా సంయుక్త కలెక్టర్ అపూర్వ భరత్,ట్రైనీ కలెక్టర్ ప్రియ, డిఆర్ఓ డా.తిప్పేనాయక్, లతో పాటు జిల్లా పరిషత్ సీఈఓ లక్ష్మణరావు,డ్వామా పిడి మధుసూదన్,జిల్లా స్వర్ణ గ్రామ, వార్డుఅధికారి జె.వేణుగోపాల్, డీడీఓ పి.వాసు దేవర రావు,బీసీ కార్పొరేషన్ ఈడీ ఏ.శ్రీనివాస రావు, తదితరులు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. అర్జీల స్వీకరణ కు ముందు గా జిల్లా కలెక్టర్ జిల్లా అధికారుల తో గతంలో పీజీఆర్ఎస్ ద్వారా అందిన అర్జీలకు తీసుకున్న చర్యలపై అధికారులతో సమీక్షించారు.. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... సమస్యల పరిష్కారం లో శాఖా పరిధుల కంటే ప్రజలఅవసరాలకే ప్రాధాన్యతనిస్తూ ముఖ్యంగా విద్యాశాఖ, గ్రామ వార్డు సచివాలయాలు,రెవెన్యూ, ఆర్ అండ్ బి, బ్యాంకింగ్ విభాగాలు ఒకరికొకరు సహకరించుకుంటూ ఉమ్మడి చర్యలతో లబ్ధిదారులకు క్షేత్ర స్థాయి లోనే పూర్తి ప్రయోజనం చేకూర్చాలని ఆదేశించారు. రోడ్ల ఆక్రమణల వంటి సంక్లిష్ట సమస్యలలో సంబంధిత శాఖలు కలసి సంయుక్త తనిఖీలు చేసి శాశ్వత పరిష్కారాన్ని అందించాలని,అర్జీ దారుల పూర్తి స్థాయి సంతృప్తే ధ్యేయంగా జవాబుదారీతనంతో పనిచేసి కాకినాడ జిల్లాను ఆదర్శంగా నిలపాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు,కలెక్టరేట్ సెక్షన్ల పర్య వేక్షకులు తదితరులు పాల్గొన్నారు.



# సొంత జట్టుతో కొట్లాట.. పంజాబ్ కింగ్స్ స్టార్ ప్లేయర్ సంచలన నిర్ణయం



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ లో రచ్చ చేసిన పంజాబ్ కింగ్స్ ఆల్‌రౌండర్ శశాంక్ సింగ్ సొంత స్టేట్ టీమ్‌తోనే ఇప్పుడు లొల్లి పెట్టుకొని గట్టి నిర్ణయం తీసుకున్నాడు. ఛత్తీస్‌గఢ్ స్టేట్ క్రికెట్ సంఘం ) తనకు అస్సలు సపోర్ట్ ఇయ్యలేదని, ఏమాత్రం చెప్పకుండా టీమ్ నుంచి పక్కనబెట్టిందని ఆరోపించాడు. అందుకే ఆ టీమ్‌ను వదిలేసి, వచ్చే 2026-27 డొమెస్టిక్ సీజన్ నుంచి పాండిచ్చేరి తరఫున ఆడబోతున్నట్టు చెప్పేసిండు. దీనికి సంబంధించి ఛత్తీస్‌గఢ్ బోర్డు నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ ) కూడా తీసుకున్నాడు.

**గాయపడితే పట్టించుకోలే.. అడిగితే అసలు జవాబే లేదు:**

శశాంక్ సింగ్ మాట్లాడుతూ.. గత సీజన్‌లో నాకు భుజం, వేలికి తీవ్ర గాయాలైనయి. ఆ సమయంలో ఛత్తీస్‌గఢ్ క్రికెట్ అసోసియేషన్ నన్ను అస్సలు పట్టించుకోలే, సపోర్ట్ కూడా చేయలే.. గాయం తగ్గినంక కూడా ఛత్తీస్‌గఢ్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ (జజబూా 2026) ప్లేయర్ల లిస్టులకెల్లి నా పేరు తీసేసింన్రు. బెంగళూరుల జరిగిన ప్రీ-సీజన్ క్యాంప్‌కి కూడా నన్ను పిలవలే.. నా పేరు ఎందుకు తీసేసింన్రు? అని అడిగితే అసోసియేషన్ వాళ్లు జవాబు చెప్పలేదని ఆవేదన వ్యక్తం చేసిండు.

**నేను ఐపీఎల్ మాత్రమే ఆడతాననడం అబద్ధం:**

తాను ఐపీఎల్ ఒక్కటే ఆడడానికే ఇంట్రెస్ట్ చూపిస్తున్నానని, డొమెస్టిక్ మ్యాచ్‌లను లైట్ తీసుకుంటున్నానని వచ్చిన వార్తలను శశాంక్ సింగ్ తీవ్రంగా ఖండించాడు. నేను డొమెస్టిక్ మ్యాచ్‌లు ఆడకుండా కేవలం ఐపీఎల్ ఆడటానికే చూడట్లే.. గత సీజన్ (2023-24 ) లోనే డొమెస్టిక్ వైట్ బాల్ మ్యాచ్‌లలో బెస్ట్ ఆల్‌రౌండర్ ప్రదర్శన ఇచ్చినందుకు బీసీసీఐ నాకే ప్రతిష్టాత్మకమైన లాలా అమర్‌నాథ్ అవార్డు ఇచ్చింది. ఇండియాలోనే బెస్ట్ ఆల్‌రౌండర్‌గా నిలిచినా నేను డొమెస్టిక్ ఆడా అనడం ఏంది? అని ప్రశ్నించాడు.

**డొమెస్టిక్, ఐపీఎల్‌లో మాస్ రచ్చ:**

గత కొంతకాలంగా దేశవాళీ మ్యాచ్‌లలోనూ, ఐపీఎల్‌లోనూ శశాంక్ కిర్రాక్ పర్ఫార్మెన్స్ ఇస్తున్నాడు.

2024--25 డొమెస్టిక్ రికార్డు: విజయ్ హజారే ట్రోఫీలో 7 మ్యాచ్‌లలోనే 450 రన్స్, 11 వికెట్లు తీసిండు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో 7 మ్యాచ్‌లలో 188 రన్స్ కొట్టిండు.

ఐపీఎల్ 2025లో విధ్వంసం: పంజాబ్ కింగ్స్ ఐపీఎల్ 2025 ఫైనల్‌కి పోవడంలో శశాంక్ కీలక పాత్ర పోషించాడు. 153.51 స్ట్రైక్ రేట్‌తో ఏకంగా 350 రన్స్ కొట్టిండు. బెంగళూరుతో జరిగిన ఫైనల్లోనైతే కేవలం 30 బంతుల్లో 61 రన్స్ (నాటౌట్)తో చెలరేగాడు.

**పాండిచ్చేరితో కొత్త ఇన్నింగ్స్:**

వచ్చే సీజన్ నుంచి రెడ్-బాల్ (రంజీ) క్రికెట్‌కి కొద్దిగా గ్యాప్ ఇచ్చి, వైట్-బాల్ (ు20, ాణ×) ఫార్మాట్‌పైనే పూర్తి ఫోకస్ పెట్టాలని శశాంక్ సింగ్ ఫిక్స్ అయ్యాడు. టీ20ల్లో తన 4 ఓవర్ల కోటా పూర్తిగా బౌలింగ్ వేసే పక్కా ఆల్‌రౌండర్‌గా నిలబడాలనేదే తన మెయిన్ గోల్ అని చెప్పిండు. 2018ల ముంబైని వదిలేసి మంచి ఛాన్స్‌ల కోసం ఛత్తీస్‌గఢ్‌కు వచ్చిన శశాంక్, ఇప్పుడు ఆ అసోసియేషన్‌తో గొడవపడి బయటికొచ్చి పాండిచ్చేరి జట్టుతో తన డొమెస్టిక్ కెరీర్‌లో కొత్త ఇన్నింగ్స్ స్టార్ట్ చేయబోతున్నాడు.

# భారత జట్టుతో నా ఐదేళ్ల ప్రయాణం ముగిసింది.. ఈ జ్ఞాపకాలని జీవితంలో మార్చిపోలేను



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ జట్టు సక్సెస్‌లో కీలక పాత్ర పోషించిన ఫీల్డింగ్ కోచ్ టి.దిలీప్ తన పదవీకాలానికి ముగింపు పలికారు. జింబాబ్వే పర్యటనతో ఆయన కాంట్రాక్ట్ పూర్తి కావడంతో, టీమిండియాతో ఐదేళ్ల అనుబంధానికి తెరపడింది. ఈ నేపథ్యంలో ఈరోజు (ఆగస్టు 3న, సోమవారం) ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక భావోద్వేగ లేఖను విడుదల చేశారు. జట్టుతో తన ప్రయాణం ఎంతో గొప్పగా కొనసాగింది, ఆ జ్ఞాపకాలను ఎప్పటికీ మరువలేనని పేర్కొన్నారు. నవంబర్ 2021లో భారత ఫీల్డింగ్ కోచుగా బాధ్యతలు చేపట్టిన దిలీప్.. జింబాబ్వే పర్యటనతో తన కాంట్రాక్ట్ ముగియడంతో జట్టు నుంచి తప్పుకున్నారు. ఆయన స్థానంలో శుభదీప్ ఘోష్ కొత్త ఫీల్డింగ్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా దిలీప్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. ఐదేళ్లు ఎంతో అర్థవంతమైన ఈ ప్రయాణానికి సరైన మాటలు దొరకడం లేదు.. నేను ఈ సెటప్‌లోకి అడుగు పెట్టినప్పుడు ప్రతిరోజూ నా వంతుగా 100 శాతం ఇవ్వాలనే ఒక్కటే లక్ష్యంతో వచ్చానని వెల్లడించారు.

**ప్రత్యేక ఆకర్షణగా ఫీల్డింగ్ మెడల్ ట్రెండ్:**

డ్రెస్సింగ్ రూమ్‌లో మ్యాచ్ తర్వాత ఉత్తమ ఫీల్డర్‌కు ఇచ్చే ఫీల్డింగ్ మెడల్ ఆచారాన్ని టి. దిలీప్ ప్రారంభించారు. ఇది ఆటగాళ్లలో పోటీతత్వాన్ని పెంచడంతో పాటు జట్టులో ఉత్సాహాన్ని నింపింది. ముఖ్యంగా 2023 వన్డే ప్రపంచకప్ సమయంలో ఈ సంప్రదాయం ఎంతగానో ప్రాచుర్యం పొందింది. ఈ అనుభూతిని గుర్తు చేసుకుంటూ.. ఫీల్డింగ్ మెడల్ నా హృదయంలో ఎప్పటికీ ప్రత్యేక స్థానంలో ఉంటుంది. డ్రెస్సింగ్ రూమ్‌లో అది సృష్టించిన ఉత్సాహం, ఆటగాళ్లు దానికి ఇచ్చిన విలువ ఎప్పటికీ మర్చిపోలేనని చెప్పుకొచ్చాడు.

**అరుదైన విజయాలకు వేదిక:**

తన ఐదేళ్ల పదవీకాలంలో టీమిండియా సాధించిన అద్భుత విజయాలను దిలీప్ గర్వంగా గుర్తు చేసుకున్నారు.

2024 , 2026 ఐసీసీ టీ20 ప్రపంచకప్ విజయాలు
2025 ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ గెలుపు,
2023 , 2025 ఆసియా కప్ విజయాలు
2023 ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్, వన్డే ప్రపంచకప్ రన్నరప్స్

**ప్రత్యేక కృతజ్ఞతలు:**

బీసీసీఐతో పాటు తనతో కలిసి పని చేసిన ప్రతి ఒక్కరికీ దిలీప్ ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి దేశానికి సేవ చేసే అవకాశం కల్పించినందుకు బీసీసీఐకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపాడు. అలాగే, రాహుల్ ద్రావిడ్, గౌతమ్ గంభీర్‌లు తనపై ఉంచిన నమ్మకానికి ధన్యవాదాలు చెప్పాడు.

ఇక రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, విరాట్ కోహ్లీ, హార్దిక్ పాండ్యా, శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్‌లతో పని చేయడం తన అదృష్టమన్నారు. ఈ అధ్యాయం ముగిసినా, భారతదేశ జెర్సీని ధరించి దేశానికి సేవ చేసిన ఈ ఐదేళ్లు నా జీవితంలో ఎప్పటికి మరువలేని జ్ఞాపకాలుగా మిగిలిపోతాయి.. భారత్ మాతా కీ జై! అంటూ తన సందేశాన్ని మాజీ ఫీల్డింగ్ కోచ్ టి. దిలీప్ ముగించాడు.

# భారత జట్టులో వరుస గాయాలతో ఆందోళన.. శ్రీలంక టూర్ తర్వాత బీసీసీఐ రివ్యూ



**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీలంక జట్టుతో ఆగస్టు 15వ తేదీ నుంచి జరగనున్న రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌కు సిద్ధమవుతున్న భారత క్రికెట్ జట్టు ప్రస్తుతం తీవ్రమైన గాయాల సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఆగస్టు 15 నుంచి గాలే వేదికగా తొలి టెస్ట్ ప్రారంభం కానుండగా.. కీలక ఆటగాళ్లు గాయాల కారణంగా దూరమవడం జట్టును తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది.

**గాయాల బారిన పడ్డ కీలక ప్లేయర్స్:**

ఇప్పటికే హార్దిక్ పాండ్యా, నితీష్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా లాంటి ఆటగాళ్లు గాయాల కారణంగా టీమిండియాకు దూరంగా ఉండగా.. తాజాగా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా కూడా మోకాలి గాయంతో ఈ సిరీస్‌కు దూరమయ్యాడు. ప్లేయర్స్ వరుస గాయాలు కెప్టెన్, కోచ్‌లకు తుది జట్టును ఎంపిక చేయడంలో తీవ్ర తలనొప్పిగా మారింది.

**ఫిజియో, డాక్టర్లపై బీసీసీఐ నిఘా:**

ఆటగాళ్లు తరచూ గాయ పడుతుండటంపై బీసీసీఐ తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తుంది. జట్టు ప్రధాన ఫిజియో కమలేశ్ జైన్, డాక్టర్ రిజ్వాన్ ఖాన్ ల పని తీరుపై బోర్డు దృష్టి పెట్టింది. బీసీసీఐ సెంట్రల్ ఆఫ్ ఎక్సలెన్స్ నిపుణుల పాత్రపై కూడా సమీక్ష జరుపుతున్నట్లు సమాచారం. ఒక జట్టులో ప్రతి స్థానానికి తీవ్రమైన పోటీ ఉన్నప్పుడు, ఆటగాళ్లు తమ శరీరాన్ని కష్టపెట్టాల్సి వస్తుంది. ఇక్కడే సపోర్ట్ స్టాఫ్, జశీజు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ప్లేయర్స్ ను తొందరగా బరిలోకి దింపకుండా అలర్ట్ చేయాలి.. కానీ ప్రస్తుత పరిస్థితి ఇబ్బందికరంగా మారింది, బాధ్యులందరినీ జవాబుదారీగా చేయాలని బీసీసీఐ వర్గాలు పేర్కొంటున్నాయి.

**డబ్ల్యూటీసీ ఫైనల్ రేసులో నిలవాలంటే:**

ప్రస్తుత టెస్ట్ సిరీస్ భారత్‌కు అత్యంత కీలకం కానుంది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (ఔజ) ఫైనల్ రేసులో నిలవాలంటే.. భారత్ ఆడబోయే తదుపరి 9 టెస్టుల్లో కనీసం 7,8 మ్యాచ్‌ల్లో విజయం సాధించాల్సి ఉంటుంది. శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని యంగ్ టీమ్ ఈ లంక పర్యటనలో ఎలాంటి ప్రదర్శన కనబరుస్తుందో చూడాల్సి ఉంది.

# టాలీవుడ్ లో లక్కీలేడీగా మారిన మిరాయ్ బ్యూటీ.. ఆ అదృష్టం వరిస్తుందా?



తమన్నా భాటియా యొక్క ర్యాంప్ వాక్ యొక్క థ్రిల్ అనుభూతి చెందండి

టాలీవుడ్‌కి అశోక వనంలో అర్జున కళ్యాణం' సినిమాతో పరిచయమై, ఆ తర్వాత వచ్చిన 'మిరాయ్' చిత్రంతో మంచి విజయాన్ని అందుకుంది యంగ్ హీరోయిన్ రితిక నాయక్ రెండు వరుస హిట్లతో ఇండస్ట్రీలో లక్కీ హీరోయిన్‌గా పేరు తెచ్చుకుంది. ఇప్పుడు ఆమె వరుణ్ తేజ్‌తో కలిసి 'కొరియన్ కనకరాజు' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానుంది.. మరి ఈ సినిమాతో ఆమె హ్యాట్రిక్ కొట్టి, అదృష్టాన్ని అందిపుచ్చుకుంటుందా? అటు వరుణ్ తేజ్‌కు కూడా విజయాన్ని అందిస్తుందో లేదో చూడాలి..



**తొలి సినిమాతోనే మంచి గుర్తింపు:**

రితిక నాయక్ తన కెరీర్ ప్రారంభంలోనే సరైన కథను ఎంచుకుంది. 'అశోక వనంలో అర్జున కళ్యాణం' సినిమాలో ఆమె నటనకు, అందానికి మంచి మార్కులు పడ్డాయి. బాక్సాఫీస్ వద్ద కూడా ఈ సినిమా మంచి విజయం సాధించడంతో, అందరి దృష్టి రితికపై పడింది.

**'మిరాయ్'తో దక్కిన మరో ఘనవిజయం:**

మొదటి సినిమా హిట్ అయిన తర్వాత వచ్చిన 'మిరాయ్' మూవీ కూడా భారీ విజయాన్ని అందుకుంది. దీంతో మొదటి రెండు సినిమాలతోనే వరుసగా రెండు హిట్లు తన ఖాతాలో వేసుకుంది రితిక. అలాగే 'హాయ్ నాన్న'లో ఆమె చేసిన చిన్న మెరుపు లాంటి రోల్ కూడా కుర్రకారును బాగా ఆకట్టుకుంది.

**సినిమాల మధ్య పెద్ద గ్యాప్:**

ఇంత మంచి గుర్తింపు వచ్చినా, రితిక వరుసగా సినిమాలు సంతకం చేయకపోవడం కాస్త మైనస్ అనే చెప్పాలి. ఇక ఇండస్ట్రీలో నిలదొక్కుకోవాలంటే ఎప్పుడూ వార్తల్లో, స్క్రీన్ మీద కనిపించడం చాలా అవసరం. ఈ పెద్ద గ్యాప్ వల్ల ఆమె కెరీర్ వేగం కాస్త తగ్గుతోందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

**హ్యాట్రిక్ కొట్టే రేర్ చాన్స్:**

ఇప్పుడు మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా, మేర్లపాక గాంధీ దర్శకత్వంలో వస్తున్న 'కొరియన్ కనకరాజు' సినిమాలో రితిక హీరోయిన్‌గా నటించింది. ఈ సినిమా కూడా హిట్ అయితే, కెరీర్ ప్రారంభంలోనే వరుసగా మూడు హిట్లు కొట్టిన అరుదైన నాయికగా రితిక చరిత్ర సృష్టిస్తుంది. మరి ఆ అదృష్టం ఆమెను వరిస్తుందో లేదో మూవీ రిలీజ్ తో తేలనుంది.

**వరుణ్ తేజ్‌కి లక్ కలిసి వస్తుందా?:**

మరోవైపు, హీరో వరుణ్ తేజ్‌కి ఈ సినిమా విజయం చాలా కీలకం. సరైన హిట్ కోసం చూస్తున్న వరుణ్‌కి, లక్కీ చార్మ్‌గా మారిన రితిక నాయక్ అదృష్టం ఏ మేరకు కలసివస్తుందో చూడాలి. ఈ కాంబినేషన్ బాక్సాఫీస్ వద్ద ఏ రేంజ్ సక్సెస్ సాధిస్తుందో త్వరలోనే తేలనుంది.మొత్తానికి ఆగస్టు 7న విడుదల కానున్న 'కొరియన్ కనకరాజు' చిత్రం రితిక నాయక్ కెరీర్‌కి చాలా ప్లస్ అయ్యేలా కనిపిస్తోంది. మరి ఈ 'మిరాయ్' బ్యూటీ తన లక్ తో ఇటు తనకు హ్యాట్రిక్ హిట్ ఇస్తూ, అటు వరుణ్ తేజ్‌కు కూడా సక్సెస్ అందిస్తుందో లేదో వేచి చూడాల్సిందే!..



ప్రకృతి పావని నెయిల్స్ బ్రౌన్ లాంగ్ స్లీవ్ లుక్

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com